

విశాఖలో గూగుల్ డేటా సెంటర్

- 6న ఇక్కడే ఒప్పందం...రహస్యంగా ఉంచిన ప్రభుత్వం
- రెండు దశాబ్దాల క్రితమే విశాఖ కంపెనీతో టైఅప్

ప్రపంచంలోనే అతి పెద్ద ఐటీ కంపెనీ గూగుల్ విశాఖపట్నంలో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకువచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది.

...వివరాలు మెయిన్‌లో

ఉత్తమ పంచాయతీలకు పురస్కారాలు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్న న్యాయంపూడి, తగరంపూడి సర్పంచులు





రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి పురస్కారాలు అందుకుంటున్న న్యాయంపూడి సర్పంచ్ రెడ్డి వరహాలబాబు, తగరంపూడి సర్పంచ్ యాదగిరి అప్పారావు

నక్కపల్లి/ కొత్తూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):
దీన్ దయాల్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలకు ఎంపికైన పంచాయతీలకు బుధవారం ఢిల్లీలో అవార్డులను ప్రదానం చేశారు. అనకాపల్లి జిల్లా నుంచి నక్కపల్లి మండలం న్యాయంపూడి (తాగునీటి సరఫరా విభాగం), అనకాపల్లి మండలం తగరంపూడి (పచ్చదనం, పరిశుభ్రత విభాగం) ఎంపికైన విషయం తెలిసిందే. న్యాయంపూడి పంచాయతీ సర్పంచ్ రెడ్డి వరహాలబాబు, తగరంపూడి పంచాయతీ సర్పంచ్ యాదగిరి అప్పారావుకు బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారాలను అందుకున్నారు. ఈ కార్యక్రమానికి జడ్పీ సీఈవో నారాయణమూర్తి, డీపీవో శిరీషారాణి, డీపీఆర్సీ జిల్లా కో-ఆర్డినేటర్ ఈ.నాగలక్ష్మి, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు.

స్టార్ రేటింగ్స్‌లో వెనుకబడి!

జిల్లాలో ఒక్క పాఠశాలకూ దక్కని 4, 5 స్టార్స్



అనకాపల్లి మండలం మామిడిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల

- మొత్తం పాఠశాలలు: 1,447
- 454 పాఠశాలలకు సింగిల్, 820 పాఠశాలలకు 2 స్టార్, 172 స్కూళ్లకు 3 స్టార్..
- 2023-24లో యూడైస్ వివరాల ప్రాతిపదికన రేటింగ్
- కలెక్టర్ల సదస్సులో సీఎంకు నివేదిక అందజేసిన విజయకృష్ణన్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, గత విద్యా సంవత్సరంలో పొందిన మార్కుల ఆధారంగా కూటమి ప్రభుత్వం ఒకటి నుంచి ఐదు వరకు స్టార్ రేటింగ్‌లు ఇచ్చింది. జిల్లాలో ఒక్క పాఠశాల కూడా నాలుగు, ఐదు నక్షత్రాల రేటింగ్‌కు ఎంపిక కాలేదు. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాల స్టార్ రేటింగ్ నివేదికను బుధవారం అమరావతిలో ప్రారంభమైన రెండు రోజుల జిల్లా కలెక్టర్ల సదస్సులో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, సీఎం చంద్రబాబు నాయుడుకు అందజేశారు.

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకపోవడం, నూతనే విద్యా చట్టం పేరుతో ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం, తదితర కారణాల వల్ల విద్యా ప్రమాణాలు పడిపోయాయి. ఇటువంటి పరిస్థితులను చక్కదిద్దేందుకు కూటమి ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితుల ఆధారంగా స్టార్ రేటింగ్స్ ఇచ్చి, వాటిల్లో మౌలిక వసతులను మెరుగు పరచనున్నట్టు రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ ఇటీవల ప్రకటించారు. ఈ మేరకు జిల్లా విద్యా శాఖాధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ఆధారంగా స్టార్ రేటింగ్‌లు ఇచ్చారు. పాఠశాలల్లో వసతి, తరగతి గదులు, మరుగుదొడ్లు, నీటి వసతి, విద్యుత్, డిజిటల్ సదుపాయాలు, ప్రహరీ గోడలు, ఫర్నిచర్, గ్రంథాలయంతోపాటు విద్యార్థులు సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకొని (2023-24 విద్యా సంవత్సరంలో యూడైస్ వివరాలను ప్రాతిపదికగా చేసుకుని) ఒకటి నుంచి ఐదు వరకు స్టార్ రేటింగ్స్ ఇచ్చారు. జిల్లాలో 1,447 పాఠశాలలు వుండగా.. వీటిలో 454 పాఠశాలలు సింగిల్ స్టార్, 820 పాఠశాలలు 2 స్టార్, 172 స్కూళ్లు 3 స్టార్ రేటింగ్‌లో వున్నాయి. 4, 5 స్టార్ రేటింగ్ ఒక్క పాఠశాలకు కూడా దక్కలేదు. పాఠశాలలో పూరిస్థాయి సదుపాయాలతో పాటు విద్యార్థులు మంచి మార్కులు సాధిస్తే నాలుగు, ఐదు స్టార్ రేటింగ్‌లు ఇస్తారు. కానీ జిల్లాలో

... మిగతా 8వ పేజీలో

అభివృద్ధి పనులకు అధికారుల మోకాలడ్డు

జడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో ఎలమంచిలి నియోజకవర్గానికి చెందిన సభ్యుల ఆరోపణ

- కొంతమంది ఎమ్మెల్యేలు సహకరించడం లేదన్న చైర్‌పర్సన్
- ఈ పరిస్థితిలో మార్పు రాకపోతే వచ్చే జనరల్ బాడీ సమావేశాన్ని బహిష్కరిస్తామని హెచ్చరిక
- మండలాల్లో సదరం మెగా క్యాంపుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతి
- పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణపై చైర్‌పర్సన్ అసంతృప్తి



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



జడ్పీ నుంచి మంజూరైన నిధులతో చేపడుతున్న పనులకు అధికారులు అడ్డు తగులుతున్నారని నిరసన వ్యక్తం చేస్తున్న ఎలమంచిలి పరిధిలోని జడ్పీటీసీ సభ్యులు (ఫొటోలో కుడివైపున ఎలమంచిలి జడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి భర్త రాము)

విశాఖపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):
జిల్లా పరిషత్ నిధులతో ప్రతిపాదించిన పనులు చేపట్టకుండా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు అడ్డుపడుతున్నారని జడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు. జడ్పీ సమావేశ మందిరంలో బుధవారం ఒకటి నుంచి ఏడు స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. ఒకటి, ఏడు స్థాయీ సంఘ సమావేశాల్లో మునగపాక, ఎలమంచిలి, రాంబిల్లి జడ్పీటీసీ సభ్యులు పెంటకోట సత్యనారాయణ, సేనాపతి సంధ్యారాణి, ధూళి నాగరాజు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం, జడ్పీ సాధారణ నిధుల నుంచి అందరికీ నిధులు కేటాయించారని, అయితే ఎలమంచిలి నియోజకవర్గంలో ఇంజనీర్లు పనులు ప్రారంభించడానికి ఆమోదం తెలపడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర స్పందిస్తూ పనులు చేపట్టవద్దని కొన్నిచోట్ల అధికారులను ఎమ్మెల్యేలు బెదిరిస్తున్నారన్నారు. సీనియర్ ఎమ్మెల్యేలు ఉన్నచోట ఇబ్బంది లేదని, కొత్తగా వచ్చిన ఒకరిద్దరు ఎమ్మెల్యేలు మాత్రం జడ్పీ నిధులకు సంబంధించి పనులు చేపట్టవద్దని చెబుతున్నారన్నారు. ఈ విధానంలో మార్పు రాకపోతే వచ్చే జనరల్ బాడీ సమావేశాన్ని బహిష్కరిస్తామని చైర్‌పర్సన్ హెచ్చరించారు. ఈ అంశంపై పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసరావు బదులిస్తూ పనులకు ఆటంకం లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ అధ్యక్షతన జరిగిన రెండు, ఐదు స్థాయీ సంఘ సమావేశాల్లో సామాజిక పింఛన్ల సర్వేపై చైర్‌పర్సన్ సుభద్ర, దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, తదితరులు ఆందోళన వ్యక్తంచేశారు. పింఛన్ల ఏరివేత కోసం

... మిగతా 8వ పేజీలో

సామాజిక భవన నిర్మాణంలో అక్రమాలు

- నిధులు స్వాహా చేశారని సర్పంచ్‌పై ఫిర్యాదు
- ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎంపీడీవో విచారణ



జమ్మాదేవిపేటలో నిర్మించిన సామాజిక భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో మేరీరోజీ

గొలుగొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):
సామాజిక భవన నిర్మాణంలో పప్పుశెట్టిపాలెం పంచాయతీ సర్పంచ్ నిధులు స్వాహా చేశారని స్పందనలో అందిన ఫిర్యాదుపై ఎంపీడీవో మేరీరోజీ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు బుధవారం గ్రామంలో విచారణ చేపట్టారు. ఇందుకు సంబంధించి ఫిర్యాదులోని అంశాలను పరిశీలిస్తే.. పప్పుశెట్టిపాలెం పంచాయతీ శివారు జమ్మాదేవిపేట గ్రామంలో రామాలయం ఎదుట సామాజిక భవనం నిర్మాణానికి సుమారు నాలుగేళ్ల క్రితం గ్రామస్థులు పూనుకున్నారు. లక్ష రూపాయలకు పైగా చందాల రూపంలో వసూలు చేసి పిల్లర్ల వరకు నిర్మించారు. ఈ సమయంలో పంచాయతీ ఎన్నికలు రావడంతో వైసీపీ మద్దతుతో సర్పంచ్ పదవికి పోటీ చేసిన మాకిరెడ్డి విజయలక్ష్మి.. తనను ఏకగ్రీవంగా గెలిపిస్తే తమ సొంత సొమ్ముతో సామాజిక భవన నిర్మాణాన్ని పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆమె తప్ప మరెవరూ నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత ఏడాది సామాజిక భవన నిర్మాణం పూర్తి చేశారు. దీనికి రూ.4.83 లక్షలు ఖర్చు చేసినట్టు పంచాయతీ సర్పంచ్ ఆ మేరకు డబ్బులను పంచాయతీ సాధారణ నిధుల నుంచి డ్రా చేశారు. ఈ విషయం ఆలస్యంగా గత నెలలో నిర్వహించిన గ్రామ సభలో వెలుగు చూడడంతో గ్రామస్థులు అవాక్కయ్యారు. సామాజిక భవనం మిగిలిన పనులకు రెండున్నర లక్షల రూపాయలకు మించి కావని, పైగా తనను ఏకగ్రీవంగా గెలిపిస్తే సొంత నిధులతో సామాజిక భవనం నిర్మిస్తానని సర్పంచ్ విజయలక్ష్మి హామీ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. సామాజిక భవనం నిర్మాణంలో నిధులు దుర్వినియోగం జరిగాయని ఆరోపిస్తూ

... మిగతా 8వ పేజీలో

అల్పపీడనంతో అప్రమత్తం

వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ

- వరి కోతలు తాత్కాలికంగా వాయిదా వేసుకున్న రైతులు
- ఇప్పటికే కోతకోసిన పొలాల్లో హడావిడిగా కుప్పలు
- అధికార యంత్రాంగం అప్రమత్తం
- కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్
- ఫోన్ నంబర్లు: 08924-226599, 222888



మాకవరపాలెం మండలం పైడిపాలలో వరి పనలను కుప్ప వేస్తున్న రైతులు

అనకాపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):
నైరుతి బంగాళాఖాతంలో కొనసాగు తున్న తీవ్ర అల్పపీడనం ప్రభావంతో అనకాపల్లి జిల్లాలో వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ ప్రకటనతో ఇటు వరి రైతులు, అటు ప్రభుత్వ అధికారులు అప్రమత్తమయ్యారు. బుధవారం జిల్లాలో ఎక్కడా వర్షం పడకపోయినప్పటికీ ఆకాశం మేఘావృతమై మసుగ్గా వుంది. తీవ్ర అల్పపీడనం నెమ్మదిగా కదులుతుం డడంతో తీరాన్ని చేరేవరకు లేదా మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం వుందని అంటున్నారు. అందువల్ల శుక్రవారం వరకు వరి కోతలు కోయవద్దని అధికారులు సూచిస్తున్నారు. కాగా వర్షాల హెచ్చరికల నేపథ్యంలో రైతులు వరి కోతలను తాత్కాలికంగా

... మిగతా 8వ పేజీలో

సాగునీటి సంఘాలకు 14న ఎన్నికలు

- నోటిఫికేషన్‌ను విడుదల చేసిన ప్రభుత్వం

అనకాపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):
సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఎట్టకేలకు తేదీలు ఖరారయ్యాయి. అసెంబ్లీ సమావేశాలు, తుఫాన్, వర్షాల కారణంగా ఇప్పటికే రెండుసార్లు ఎన్నికలు వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ నెల 14వ తేదీన సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలో మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఒక్కటే (తాండవ జలాశయం) వుండగా, నాలుగు ప్రాజెక్టు కమిటీలు, మూడు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 303 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి. ఈ నెల 14న నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఒక్కో సంఘంలో ఆరుగురిని డైరెక్టర్లుగా ఎన్నుకుంటారు. ఉదయం 9.45 గంటలకు నామినేషన్లు స్వీకరణ, 10.15 నుంచి 10.30 గంటల వరకు నామినేషన్ల పరిశీలిన, తుది జాబితా ప్రకటన, 10.30 నుంచి 12.30 గంటల వరకు చేతులు ఎత్తే విధానంలో డైరెక్టర్ల ఎన్నిక నిర్వహిస్తారు. ఒకవేళ సభ్యులు ఎవరైనా కోరితే బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తారు. అనంతరం ఫలితాలను వెల్లడిస్తారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు డైరెక్టర్ల నుంచి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటారు. కాగా మూడు డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు 17న ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణకు 668 మంది గెజిటెడ్ అధికారులను, 1,530 మంది సిబ్బందిని నియమించారు. సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రైతులంతా సహకరించాలని జిల్లా జలవనరుల శాఖ ఈఈ, ఎన్నికల నోడల్ అధికారి ఎ.త్రినాథం ఒక ప్రకటనలో కోరారు.

మేడివాడలో ఉద్రిక్తత

శ్మశానవాటిక విషయంలో ఇరుమతాల వారి మధ్య గొడవ

- జగనన్న కాలనీకి సమీపంలోని పాత కబ్రిస్థాన్‌లో మృతదేహం ఖననానికి బంధువులు ఏర్పాట్లు
- అభ్యంతరం వ్యక్తం చేసిన మరో మతం వారు
- ఊరు చివర కొత్త శ్మశానవాటికలో ఖననం చేసుకోవాలని సూచన
- ఉభయవర్గాల మధ్య వాగ్వాదం, ఘర్షణ
- గ్రామానికి చేరుకున్న పోలీసు, రెవెన్యూ అధికారులు
- ఇరుమతాల పెద్దలతో చర్చలు.. సమస్య పరిష్కారం



మేడివాడలో ఘర్షణ పడుతున్న రెండు మతాల వారు

రావికమతం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):
మృతిచెందిన ముస్లిం మహిళ పార్థివదేహాన్ని ఖననం చేసే విషయంలో మండలంలోని మేడివాడ గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. కొత్తగా ఏర్పడిన ఇళ్ల కాలనీకి సమీపంలో వున్న పాత శ్మశానవాటిక (కబ్రిస్థాన్)లో ఖననం చేయడానికి సదరు మతానికి చెందిన వారు ఏర్పాట్లు చేయగా, మరో మతం వారు ఇందుకు అభ్యంతరం వ్యక్తం చేశారు. నివాస ప్రాంతానికి (జగనన్న ఇళ్ల కాలనీ) పక్కన మృతదేహాన్ని ఖననం చేయవద్దని, గ్రామానికి శివారున ఉన్న శ్మశానవాటికలో ఖననం చేయాలని చెప్పారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. సమాచారం అందుకున్న పోలీసు, రెవెన్యూ అధికారులు వచ్చి ఇరువర్గాల వారితో చర్చలు జరిపారు. సమస్యను సానుకూలంగా పరిష్కరించారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

రావికమతం మండలం మేడివాడ గ్రామానికి చెందిన తానియత్ లక్ష్మి(70) బుధవారం ఉదయం మృతిచెందింది. మృతదేహాన్ని జగనన్న కాలనీకి ఆనుకొని వున్న శ్మశానవాటిక (కబ్రిస్థాన్)లో ఖననం చేసేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ విషయం తెలుసుకున్న మరో మతం వారు అభ్యంతరం తెలిపారు. శివారులో వున్న శ్మశానవాటికలో ఖననం చేయాలని సూచించారు.ఇందుకు మృతురాలి మతానికి చెందిన వారు ససేమిరా అన్నారు. అంతేకాక చట్టుపక్కల గ్రామాల నుంచి తమ మత పెద్దలను మేడివాడకు రప్పించారు. అనాదిగా తాము కబ్రిస్థాన్‌గా వినియోగించుకుంటున్న స్థలంలోనే ఖననం చేస్తామని పట్టుబట్టారు. దీంతో ఇరు మతాల వారి మధ్య వాగ్వాదం జరిగి ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

హిందువుల శ్మశానవాటికను ఆనుకొని కబ్రిస్థాన్‌కు స్థలం కేటాయిస్తామని, మృతదేహాన్ని అక్కడ ఖననం చేయాలని సర్పంచ్ వజ్రపు వజ్రపు లీలానాగ వెంకటరత్నం సూచించారు. ఇందుకు ముస్లిం పెద్దలు నిరాకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతిష్ఠంభన కొనసాగింది. విషయం తెలుసుకున్న రావికమతం ఎస్ఐ ఎం.రఘువర్మ మేడివాడ చేరుకుని ఇరువర్గాల వారితో మాట్లాడారు. ఎవరూ వెనక్కు తగ్గకపోవడంతో ఉద్రిక్తత మరింత పెరుతున్నది. దీంతో తహసీల్దార్ బి.వెంకటరమణ, రెవెన్యూ సిబ్బంది, ఎంపీడీవో భానోజీరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాస్, కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు, తదితరులు మేడివాడ వచ్చారు. ఇరుమతాల పెద్దలతో చర్చలు జరిపారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని వారు కోరారు. హిందువుల శ్మశానవాటికలో 10 సెంట్లు స్థలాన్ని కబ్రిస్థాన్‌కు కేటాయించడానికి ఇరువర్గాల మధ్య అంగీకారం కుదిరింది. అనంతరం తానియత్ లక్ష్మి మృతదేహాన్ని అక్కడకు తరలించి ఖననం చేశారు.

గ్రామ కంఠం ఆక్రమణదారులపై చర్యలు

▸▸ ఎంపీడీఓకి నునపర్తి వాసుల ఫిర్యాదు



ఎంపీడీఓకి ఫిర్యాదు చేస్తున్న నునపర్తి గ్రామస్థులు

అచ్యుతాపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ కంఠం ఆక్రమించి శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని నునపర్తి వాసులు బుధవారం ఎంపీడీఓ కె. ప్రభాకరరావుకు ఫిర్యాదు చేశారు. నునపర్తి నడిబొడ్డులో సామాజిక భవనానికి ఎదురుగా ఉన్న గ్రామకంఠాన్ని దశాబ్దాల నుంచి గ్రామ అవసరాల గురించి వినియోగించేవారు. కొందరు ఆక్రమించి భవన నిర్మాణం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటూ వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గొంప నరసింహనాయుడు, రెడ్డి శ్రీను, ఎరుకునాయుడు, అప్పారావు, తోడపు వరంబాబు, గొర్లె అప్పలరాజు తదితరులున్నారు.

కూటమి పాలనలో గ్రామాలకు మహర్దశ

▸▸ టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు



మూలపేటలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేసిన దృశ్యం

మునగపాక, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో గ్రామాలకు మంచి రోజులు వచ్చాయని టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో మూలపేట, గొల్లలపాలెం గ్రామాల్లో బుధవారం సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 26 పంచాయతీలకు పల్లె పండుగలో భాగంగా నిధులు మంజూరయ్యాయన్నారు. జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశరాం మాట్లాడుతూ నిధులు మంజూరు కాని గ్రామం ఏదైనా ఉందంటే అది ప్రభుత్వ వైఫల్యం కాదని, అది పాలకవర్గ నిర్లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచులు బీశెట్టి గంగఅప్పలనాయుడు, మొల్లి వెంకటలక్ష్మి, వెంకినాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రబీలో వరి, అపరాల సాగులో యాజమాన్య పద్ధతులు అవలంబించాలి : ఏడీ

రాంబిల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రబీ సీజనులో వరి, అపరాల సాగులో రైతులంతా విధిగా యాజమాన్య పద్ధతులు అవలంబించాలని వ్యవసాయాధికారిణి సి. సుమంత రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని కుమ్మరాపల్లి, మామిడివాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి, రైతులకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో సిబ్బంది టి.తులసీ మణి. జిల్లా వనరుల కేంద్రం ఏఓ సంతోషి, ఏఈవో ప్రశాంతి పాల్గొన్నారు.

ఘనంగా గౌరీశంకర ఆలయ పునఃప్రారంభం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న తోట నగేశ్ తదితరులు

పాయకరావుపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉషోదయ ఓనర్స్ డ్రైవర్స్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గౌరీ శంకర, సుబ్రహ్మణ్య, దుర్గమ్మవార్ల ఆలయ పునఃప్రారంభం, విగ్రహాల ప్రతిష్ఠ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు, అర్చకులు నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమం తదితర విశేష పూజా కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహిం చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు లావేటి ఈశ్వరరావు, వల్లు యర్రయ్య, అప్పారావు, తుమ్మితి ఏసు, పెంకె సత్తిబాబు తదితరులు సేవలు అందించారు.

మీడియాపై దాడి దుర్మార్గమైన చర్య

▸▸ సీపీఎం మండల కార్యదర్శి సత్యనారాయణ

ఎస్.రాయవరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మీడియా ప్రతినిధులపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని సీపీఎం మండల కార్యదర్శి ఎం. సత్యనారాయణ అన్నారు. వార్త సేకరించడానికి వెళ్లిన ఓ మీడియా విలేకరిపై సినీ నటుడు మోహనబాబు దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. మోహనబాబుపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సాగునీటి సంఘాలకు 14న ఎన్నికలు

▸▸ ఏడు మైనర్ సంఘాలకు డైరెక్టర్లు, చైర్మన్ల ఎన్నిక

▸▸ ఓటర్లు 9,971 మంది..

పాయకరావుపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏడు మైనర్ సాగునీటి సంఘాలకు ఈనెల 14వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు బుధవారం ఎన్నికల నోటిఫికేషన్‌ని ఇరిగేషన్ శాఖ అధికారులు విడుదల చేశారు. ఇందుకు సంబంధించి ఇరిగేషన్ ఏఈ జి.శ్రీరామూర్తి అందజేసిన వివరాలిలా ఉన్నాయి. తాండవ నదిపై ఉన్న భూమి, ముఠా మినీ ఆనకట్టల పరిధిలో భూమి చానెల్, ముఠా చానెల్, ఆవ చానెల్, మాసాహెబ్‌పేట చానెల్, మంగవరం చానెల్, రాజవరం చానెల్, కనుమల చానెల్ సిస్టమ్స్ ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 9,971 మంది సభ్య రైతులు ఉన్నారు. వీటిలో ఒక్కో సిస్టమ్ పరిధిలో ఆరుగురు డైరెక్టర్లు పదవులకు ఈనెల 14న ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 9.45కి నామినేషన్లు స్వీకరణ, 10.15 నుంచి 10.30 వరకు నామినేషన్ల పరిశీలన, తుది జాబితా ప్రకటన, 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు డైరెక్టర్లను ఎన్నుకునే ప్రక్రియ ఉంటుందన్నారు. మధ్యాహ్నం 1 గంటకి ఫలితాల ప్రకటన ఉంటుందన్నారు. అనంతరం మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఒక్కో సాగునీటి సంఘానికి ఎన్నికైన డైరెక్టర్ల నుంచి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడి ఎన్నిక అనంతరం యాజమాన్య కమిటీ సమావేశం ఉంటుందన్నారు.



నోటీస్ బోర్డులో సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ పెట్టిన అధికారులు

ఎలమంచిలి సబ్‌డివిజన్‌లో 39 నీటి సంఘాలకు ఎన్నికలు

ఎలమంచిలి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. 2015 తరువాత సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో వాటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వీటి పరిస్థితిని పట్టించుకునే వారే లేకపోవడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కూటమి ప్రభుత్వం ముందుకు రావడంతో ఈనెల 14వ తేదీన సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎలమంచిలి సబ్‌డివిజన్ పరిధిలోని ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, మునగపాక మండలాల్లో 39 సాగునీటి కాలువలు, చెరువులు ఉన్నాయి. ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎలమంచిలి మండలంలో 11 నీటి సంఘాల పరిధిలో 7,801 ఎకరాలు, అచ్యుతాపురం మండలంలో 4 నీటి సంఘాల పరిధిలో 3,052 ఎకరాలు, మునగపాక మండలంలో 11 నీటి సంఘాల పరిధిలో 7,174 ఎకరాలు, రాంబిల్లి మండల పరిధిలో 13 నీటి సంఘాల పరిధిలో 10,120 ఎకరాల్లో ఆయకట్టు భూములు ఉన్నాయి. సబ్ డివిజన్‌లోని 39 సాగునీటి సంఘాల్లో సుమారు 33,324 మంది ఓటర్లు ఉన్నారని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ బుధవారం విడుదల చేశామని, వీఆర్‌ఓల సహాయంతో సంబంధిత ఎన్నికల అధికారి ఆయా గ్రామాల్లో దండోరా వేయించనున్నారని డీఈఈ సాయి ప్రశాంతి తెలిపారు.

నీటి సంఘాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందాలి

▸▸ రాష్ట్ర ఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థుల విజయానికి సమిష్టిగా కృషి చేయాలని ఏపీ ఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నాలుగు మండలాల ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి సంఘాల ఎన్నికలను పార్టీ శ్రేణులంతా ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంతోనే సాగునీటి సంఘాలకు పూర్వవైభవం వస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దూళి రంగనాయకులు, జిల్లా కార్యదర్శి రాజాన సూర్య నాగేశ్వరరావు, జిల్లా నేత ఆడారి మంజు, మండల అధ్యక్షుడు ఇత్తంశెట్టి రాజు, పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, నాయకులు కొఠారు సాంబ, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, భీమరశెట్టి శ్రీనివాసరావు, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, దాడి మునిలినాయుడు, రాజాన వెంకునాయుడు, బొద్దపు నాగేశ్వరరావు, కరణం రవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు

ఆగని వరి కోతలు

▸▸ గింజలు రాలిపోతున్నాయంటున్న రైతులు

మునగపాక, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం హెచ్చరికలు జారీ చేసినా వరి కోతలు ఆగడం లేదు. జిల్లా అధికారుల ఆదేశాలతో స్థానిక మండల వ్యవసాయ అధికారితో పాటు గ్రామ రైతు సేవా కేంద్రం సహాయకులు రైతులకు పలు మాధ్యమాల ద్వారా అల్పపీడనం హెచ్చరికలను తెలియజేశారు. వరి కోతలు చేయవద్దని, కోసిన వారు పనలను కుప్పలుగా పెట్టమని, నూర్పిడి చేసిన ధాన్యాన్ని బస్తాలను ఆరుబయట ఉంచవద్దంటూ సూచించారు. అయినా రైతులు బుధవారం కూడా యథావిధిగా కోతలు చేపట్టారు. పది రోజులు ముందే కోయవలసిన పొలాలు తుఫాన్ కారణంగా వాయిదా వేశామని, గింజలు రాలిపోవడంతోపాటు పక్షులు కూడా తినేస్తున్నాయని, అందువలనే కోతలను ఆపలేమని రైతులు చెబుతున్నారు. కొంత మంది ఇప్పటికే కోసి ఉన్న వరి పనలను కుప్పలుగా పెడుతున్నారు. మండల వ్యాప్తంగా 1,390 హెక్టార్లలో వరి పంట సాగు చేశారు. తొంభై శాతంపైగా పంట కోతకు సిద్ధంగా ఉంది. అందరూ ఒకేసారి కోతలు మొదలు పెడితే కూలీల కొరత కూడా ఏర్పడే అవకాశం ఉందని రైతులు వారంటున్నారు. దానిని దృష్టిలో పెట్టుకొనే ధైర్యం చేసి కోతలు కొనసాగిస్తున్నామన్నారు.



మండలంలో వరి పంటను కోస్తున్న కూలీలు

రైతులకు నాణ్యమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు

▸▸ వ్యవసాయ శాఖ ఏడీ ఉమాప్రసాద్

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన ఎరువులు, క్రిమిసంహారక మందులను అందించాలని వ్యవసాయ శాఖ ఏడీ కె.ఉమాప్రసాద్ అన్నారు. మండలంలోని సత్యవరంలో బుధవారం తాండవ వాలీ ఉద్యానవన, వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని ఐఐఎంఆర్ సీనియర్ శాస్త్రవేత్త కె. శ్రీనుబాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమాప్రసాద్ మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుకాణంలో నాణ్యమైన ఎరువులు, పురుగు మందుల అందించడం వలన పంటలలో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఐఐఎంఆర్ సీనియర్ శాస్త్రవేత్త కె. శ్రీనివాసబాబు మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘంలో చేరడం వల్ల వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు చేయవచ్చునని, దాని వలన రైతులకు అనేక ఉపయోగాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎలమంచిలి కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన శైలజ, సర్పంచ్ సఖిలేటి రాము, తాండవ రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈవో జీవీవీ.సత్యనారాయణ, లంబసింగి రైతు సంఘం సీఈవో రాజేశ్, డైరెక్టర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



సత్యవరంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

భూములను ఆన్‌లైన్ చేసి సమస్యను పరిష్కరించండి

నక్కపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ భూములు చాలా వరకూ ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, తక్షణమే ఈ సమస్యను పరిష్కరించి, న్యాయం చేయాలని పలువురు రైతులు కోరారు. మండలంలోని దేవవరంలో బుధవారం డీటీ అన్నాజీరావు నేతృత్వంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వెబ్‌లాండ్, అడంగళ్లల్లో సవరణలు చేయాలని రైతులు వినతులు అందజేశారు. రెవెన్యూ సదస్సుల ఉద్దేశాన్ని ఆర్ఐ కన్నబాబు రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాఘవకుమారి, మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ, గొర్ల నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



నక్కపల్లి: రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్న డీటీ అన్నాజీరావు

అచ్యుతాపురంలో..

జగనన్న కాలనీకి ఇచ్చిన తమ భూములకు పరిహారం ఇవ్వాలంటూ ఉమ్మడి వెదురువాడ పంచాయతీ వాసులు బుధవారం వెదురువాడలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశారు. వెదురువాడ సర్వే నంబరు ఒకటిలోని భూమిని 2005లో ఉమ్మడి వెదురువాడ పంచాయతీ పరిధిలోని పేద రైతులకు డి పట్టాలిచ్చారు. అప్పటి నుంచి వీరు సాగుచేసుకొని వచ్చిన ఆదాయంతో జీవిస్తున్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల కోసం తొమ్మిదిన్నర ఎకరాలు తీసుకొని 306 ప్లాట్లుగా వేశారు. కాని రైతులకు ఇంతవరకు పరిహారం ఇవ్వలేదు. దీంతో రైతులు పరిహారం ఇవ్వాలంటూ డీటీ శ్యామ్‌కి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వెదురువాడ, గొర్లెధర్మవరం సర్పంచులు కొయ్య శ్రీనివాసరావు, గొర్లె నూకరాజు, వీఆర్వో శశి పాల్గొన్నారు.

కోటవురట్లలో..

రైతులు ఇచ్చినా ప్రతి ఫిర్యాదు ఆన్‌లైన్ చేసి 40 రోజులోపు పరిష్కరిస్తామని తహసీల్దార్ తిరుమలబాబు అన్నారు. బుధవారం చినబొడ్డేపల్లిలో గ్రామ సర్పంచ్ శివరామ్ అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సు లో ఆయన మాట్లాడుతూ రీసర్వే నిర్వహణలో ఎటువంటి లోపాలు ఉన్నా రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సదస్సులో 23 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. సమావేశంలో ఆర్ఐ, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని పెనుగొల్లులో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 17 వినతులు స్వీకరించామని తహసీల్దార్ జె. రమేష్‌బాబు తెలిపారు. ఈ సదస్సుల్లో భూ సమస్యలపై రైతులు వినతులు అందజేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులుపాల్గొన్నారు.



అచ్యుతాపురం: అర్జీని అందజేస్తున్న వెదురువాడ రైతులు



కోటవురట్ల: చినబొడ్డేపల్లి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ తిరుమలబాబు

నీటి సంఘాల ఎన్నికల్లో సమష్టిగా పనిచేద్దాం

▸▸ పేట కూటమి నాయకుల తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న లాలం కాశీనాయుడు

నక్కపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో నియోజకవర్గంలోని కూటమి నాయకులంతా సమిష్టిగా పనిచేసి, రైతులు మేలు చేసే వారిని ఎన్నుకోవాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు పిలుపునిచ్చారు. స్థానికంగా వున్న హోం మంత్రి అనిత నివాసం వద్ద నియోజకవర్గం కూటమి నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో కూటమి నాయకులు ఐక్యంగా వుండి నీటి సంఘాల ఎన్నికల్లో తిరుగులేని విజయాన్ని సాధించాలన్నారు. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, ఇచ్చిన హామీలు అమలవుతున్న తీరు తెన్నుల గురించి వివరించాలన్నారు. సమావేశంలో కూటమి నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, పెదిరెడ్డి చిట్టిబాబు, అమలకంటి అబద్ధం, జానకి శ్రీను, వెంకట్రాజు, నానాజీ, సుధాకర్, శివ, కొప్పిశెట్టి బుజ్జి, శ్రీనివాసరావు, వి.రమణ, కోసూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీలకు రేవుపోలవరం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో టీచర్ స్వర్ణగౌరి

ఎస్.రాయవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కౌశల్-2024 సైన్స్ ప్రతిభాన్వేషణ ఆన్‌లైన్ పోటీల్లో మండలంలోని రేవుపోలవరం జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు సీహెచ్ నాగరాజు, కె. దయానంద, సీహెచ్ ఐను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 30న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. హైస్కూల్ టీచర్ స్వర్ణగౌరి వీరికి స్టడీ మెటీరియల్ అందించి శిక్షణ ఇచ్చారని ఆయన తెలిపారు. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులను పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, సమన్వయకర్త సత్యనారాయణ అభినందించారు.

ఘనంగా గీతా జయంతి వేడుకలు



పూడిమడక జగన్నాథస్వామి ఆలయంలో గీతా జయంతి వేడుకలు చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిమడక జగన్నాథస్వామి ఆలయంలో గీతా జయంతి వేడుకలను సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎఫ్ ఎలమంచిలి సబ్ డివిజన్ ప్రచారకులు కొల్లి అప్పారావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్గశిర శుద్ధ ఏకాదశి నాడు గీతా జయంతిని జరుపుకోవటం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భగవద్గీత, పాంచజన్యంతోపాటు పండ్లను పంపిణీచేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు పులఖండం వంశీకృష్ణ, మేరుగు శంకర్, రాజారావు, నానాజీ, దిలీప్, నూకరాజు పాల్గొన్నారు.

27 పథకాలు పునరుద్ధరించాలి

▸▸ జేసీకి మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగభూషణం



జేసీ జాహ్నవికి వినతిపత్రం అందజేస్తున్న నాగభూషణం

మునగపాక, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో దళితులకు సంబంధించిన 27 సంక్షేమ పథకాలను నిలుపుదల చేసిందని, వాటిని తిరిగి పునరుద్ధరించాలని ఏపీ మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం కోరారు. ఈ మేరకు బుధవారం జాయింట్ కలెక్టర్ జాహ్నవిని కలిసి వినతిపత్రం అందజేశారు. దళిత వాడల్లో మౌలిక వసతులు ఏర్పాటుతోపాటు నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అర్హులైన దళితులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. చెప్పులు కుట్టే వృత్తివారికి, డప్పు కళాకారులను గుర్తించి పింఛన్ ఇవ్వాలన్నారు.

భగవద్గీత పఠనం, వినడం పుణ్యఫలం

మునగపాక, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత పఠనం చేయడం, వినడం పుణ్యఫలమని భగవద్గీత ప్రచారకుడు తేలి నూకరాజు తెలిపారు. స్థానిక విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి(లింగరాయి) ఆలయంలో బుధవారం గీతాజయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా కార్తీకమాసంలో రామాయణం, మహాభారతంల్లోని కొన్ని ఘట్టాలను పారాయణం చేస్తున్నానని, అది మనస్సుకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. ఈ వేడుకలో భాగంగా పిల్లలకు శ్లోకాల పోటీలు నిర్వహించారు. అనంతరం నూకరాజును పెద్దలు ఘనంగా సత్కరించారు.

34 మొబైల్స్‌ని రికవరీ చేసిన రైల్వే పోలీసులు



మొబైల్‌ని అందజేస్తున్న రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు

పాయకరావుపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వివిధ రైళ్లలో ప్రయాణిస్తూ తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 34 సెల్‌ఫోన్లను రైల్వే పోలీసులు రికవరీ చేసి పోగొట్టుకున్నవారికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా తుని ప్రభుత్వ రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తుని జీఆర్‌పీఎస్ పరిధిలో కొంతకాలంగా రైళ్లలో ప్రయాణికులు పోగొట్టుకున్న సుమారు రూ.7,06,400ల విలువైన 34 సెల్‌ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి రికవరీ చేశామన్నారు. వీటిని బుధవారం స్టేషన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నవారికి అందజేశామన్నారు.

ఉత్సాహంగా టి-20 క్రికెట్ టోర్నమెంట్



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సీఐ గోవిందరావు

నర్సీపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):అబ్దుల్ కలాం, రతన్ టాటా టి-20 క్రికెట్ టోర్నమెంట్ జూనియర్ కళాశాల మైదానంలో ప్రారంభమయ్యాయి. బుధవారం పట్టణ సీఐ జి.గోవిందరావు బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. టి-20 టోర్నమెంట్‌లో 8 జట్లు పాల్గొంటున్నాయి. ఈ పోటీలు 26 రోజులు నిర్వహిస్తామని అకంరెడ్డి సురేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాలం మురళి, పెదిరెడ్ల చింతు, కౌన్సిలర్ మధు పాల్గొన్నారు.

'రబీ పంటలకు బీమా చేయించుకోండి'



రైతులకు కరపత్రాన్ని అందజేస్తున్న అధికారులు

నర్సీపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రబీ పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో వరి, పెసలు, మినుము పంట లను నమోదుచేసుకోవాలని ఏడీఏ శ్రీదేవి రైతులను కోరారు. బుధవారం పలు గ్రామాలలో రైతులకు పంటల బీమాపై రైతులకు కరపత్రాలు పంపిణీ చేసి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎకరా వరి పంటకు రూ.630, పెసలు, మినుములకు రూ.300 చొప్పున బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. పంటల బీమా నమోదు చేసుకోవడానికి పెసలు, మినుములకు డిసెంబరు 15, వరికి డిసెంబరు 31వ తేదీ గడువుగా నిర్ణయించారని తెలిపారు. ఆధార్, భూమి పాస్ పుస్తకం లేదా 1 బి, బ్యాంక్ పాస్ పుస్తకం, పంట ధ్రువీకరణ పత్రం ద్వారా బీమా నమోదు చేసుకోవాలని సూచించారు.

నీటి పన్ను చెల్లించుకోవడంపై తహసీల్దార్ నిర్లక్ష్యం

▸▸ వైసీపీ నాయకులు ఆరోపణ

గొలుగొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘ ఎన్నికల్లో పోటీదారుల నుంచి నీటి పన్ను చెల్లించుకోవడంపై తహసీల్దార్ నిర్లక్ష్యం వహిస్తున్నారని వైసీపీ నాయకులు ఆరోపించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైసీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పాకలపాడు శివారు ముంగర్లపాలెం ఆనకట్టుకు సంబంధించి ఆరు సెగ్మెంట్‌లలో పోటీదారులు నీటి తీరువా చెల్లించేందుకు కార్యాలయానికి వెళ్లిన వైసీపీ నేతలను తహసీల్దార్ దురుసుగా మాట్లాడడం సరైంది కాదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల ప్రధానకార్యదర్శి ఇటంశెట్టి రాంబాబు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చినప్పారావు, వైసీపీ నాయకులు ఎల్. నాయుడు, చింతంరెడ్డి అప్పలనాయుడు, రాజాన అప్పలనాయుడు పాల్గొన్నారు. దీనిపై తహసీల్దార్ శ్రీనివాసరావును సంప్రదించగా.. వైసీపీ నాయకులపై దురుసుగా మాట్లాడలేదన్నారు. పన్ను చెల్లించేందుకుగాను ఆన్‌లైన్ సర్వర్ పనిచేయకపోవడంతో గురువారం రావాలని సమాచారం అందించినట్టు తెలిపారు.

అల్పపీడనం హెచ్చరికతో రైతుల పరుగు

▸▸ కోసిన పంటను కాపాడుకునేందుకు తంటాలు



పైడిపాలలో వరి కుప్పలు వేస్తున్న రైతులు

మాకవరపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం హెచ్చరికతో రైతులు అప్రమత్తమయ్యారు. గత వారం రోజులుగా కోసిన వరి పంటను కల్లాల్లో కుప్పలు పెడుతున్నారు. కోతలు కోయని వరి పొలాల్లో నీరు లేకుండా చూసుకుంటున్నారు. గత తుపాన్ అనంతరం మండలంలో 60 శాతం మంది వరి కోతలు కోశారు. అయితే బుధవారం ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు వచ్చి చల్లగాలులు వీచాయి. దీంతో రైతులు కోసిన వరి పనలు కుప్పలు పెట్టేందుకు అప్పటికప్పుడు కూలీలను ఏర్పాటు చేసుకున్నారు. మండలంలోని మాకవరపాలెం, పైడిపాల, కొండల అగ్రహారం, తామరం, నారాయణరాజుపేట, మల్లవరం, గిడుతూరు, లచ్చన్నపాలెం గ్రామాల్లో వరి కుప్పలు వేశారు. గత తుపాన్ కారణంగా వరి చేన్లు కింద పడిపోవడంతో పెట్టుబడి తడిపి మోపెడవుతుందని వారంటున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి చిరంజీవి మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ నుంచి అల్పపీడనం నేపథ్యంలో వరి కోతలు కోయవద్దని రైతులకు సూచించారు. అలాగే కోసిన వరి చేనును కుప్పలు వేసి, తార్పాలిన్‌లో కప్పాలని సూచించారు.

నాతవరంలో నిలిచిన ఆర్టీసీ బస్సు



నాతవరంలో ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

నాతవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాండవ నుంచి ఉదయం 5 గంటలకు నర్సీపట్నంనకు బయలుదేరిన ఆర్‌టీసీ బస్సు మండల కేంద్రంలో ఉదయం 5.30 గంటలకు నిలిచిపోయింది. బస్సులో ఏదో వైర్లు కాలిన వాసన రావడంతో డ్రైవర్ బస్సును నిలిపివేశాడు. విశాఖపట్నం. అనకాపల్లి తదితర దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఉదయం ఏడున్నర గంటలు అయినా వేరే బస్సును ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్ వాహనాల ద్వారా నర్సీపట్నం వెళ్లారు. తాండవ నుంచి నర్సీపట్నం డిపోకు ఆర్టీసీ అధికారులు కండిషన్‌లో లేని బస్సులను నడుపుతున్నారని ప్రయాణికులు మండిపడ్డారు. ఇటువంటి డొక్కు బస్సులు నడపడం వల్ల ఉదయం వేళలలో విశాఖపట్నం ఆసుపత్రులకు సకాలంలో చేరుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కండిషన్‌లో ఉన్న బస్సులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మ్యూటేషన్ దరఖాస్తులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ : ఆర్డీవో



రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న ఆర్డీవో వీవీ రమణ

నర్సీపట్నం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులలో మ్యూటేషన్ కోసం వచ్చిన దరఖాస్తులు అక్కడికక్కడే ఆన్‌లైన్ చేస్తున్నామని ఆర్డీవో వీవీ రమణ తెలిపారు. బుధవారం బలిఘట్టం బీసీ కాలనీలోని వినాయకుడి గుడి ఆవరణలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం వరకు 42 గ్రామాలలో జరిగిన రెవెన్యూ సదస్సులలో 996 దరఖాస్తులు వచ్చాయన్నారు. సివిల్ తగాదాలు, కోర్టు కేసుల్లో ఉన్న భూ వివాదాలు తప్పించే మిగిలిన అన్ని సమస్యలు రెవెన్యూ సదస్సులో పరిష్కారం అవుతాయని తెలిపారు. సమగ్ర భూ సర్వేలోని చిన్న చిన్న లోపాలు, తప్పులు సరిదిద్దు తున్నామని తెలిపారు. మ్యూటేషన్ కోసం వచ్చిన దరఖాస్తులు అక్కడిక్కడే ఆన్‌లైన్ చేస్తున్నామని, సంబంధిత డాక్యుమెంట్లు సమర్పిస్తే 15 రోజుల్లో పరిష్కారం అవుతాయని తెలిపారు.

పంట కాలువ ఆక్రమణపై ఫిర్యాదు

దుగ్గాడ కాలువ సరిహద్దు నుంచి అల్లువాని చెరువు వరకు పంట కాలువ ఆక్రమణకు గురైందని కొత్త బయపురెడ్డిపాలెంకి చెందిన ఆయకట్టు రైతులు బి.బ్రహ్మలింగస్వామి, బి.వీరనాయుడు, బి.అప్పలనాయుడు తదితరులు రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశారు.

గొలుగొండలో..

మండలంలోని బుధవారం గుండుపాల గ్రామ రెవెన్యూలో తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. రెవెన్యూపరమైన సమస్యలపై వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు వరి వర్మ, నాయకులు చినబ్బాయి, చంటి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కళా ఉత్సవం పోటీల్లో కాశీపురం విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దేవరాపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భీమిలిలో ఈ నెల 5, 6 తేదీల్లో జరిగిన కళా ఉత్సవం పోటీల్లో కాశీపురం విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జిల్లా స్థాయి కళా ఉత్సవం చిత్ర కళా పోటీల్లో బండారు జస్వంత్ ద్వితీయ స్థానం సాధించాడు. దేశభక్తి గేయం బృందం లలిత, గిరిష్మా, రిషిత, శిల్ప, రమ్య గ్రూపు తృతీయ స్థానంలో నిలిచారు. మైమింగ్ గ్రూప్ ఈవెంట్‌లో జస్వంత్, మణికంఠ, కృప, లోకేశ్ టీం తృతీయ స్థానం సాధించారు. డైట్ వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, రవి, సోమయాజులు ప్రశంసాపత్రాలు అందించారు. విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన రాంబాబును ఉపాధ్యాయులు బి.టి.సుందరి, సుజాత, రామలక్ష్మి తదితరులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీలకు జోగంపేట విద్యార్థులు



రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీలకు ఎంపికైన జోగంపేట హైస్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

గొలుగొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీలకు జోగంపేట హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 6వ తేదీన జిల్లా స్థాయిలో జరిగిన కౌశల్ పోటీల్లో జోగంపేట హైస్కూల్ విద్యార్థులు ఆర్.రేష్మా, పి.స్వాతి, వి.కిరణకుమార్ ప్రతిభ కనబరిచారు. ఈనెల 29, 30 తేదీల్లో విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయురాలు సరోజిని తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, అప్పారావు, బి.లోవరాజు, అంబిక అభినందించారు.

ఒకే సర్వీస్ రూల్స్ అమలు చేయాలి

▸▸ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

మాకవరపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వివిధ యాజమాన్యాలలో పనిచేసే ఉపాధ్యాయులందరికీ ఒకేవిధమైన సర్వీస్ రూల్స్ అమలు చేయడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్సీ పాకలపాటి రఘవర్మ అన్నారు. బుధవారం మండలంలోని మాకవరపాలెం, వజ్రగడ తదితర గ్రామాల్లో పాఠశాల ఉపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతపెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు కృషి చేయనున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలపై శాసనమండలిలో ప్రస్తావించానన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు నిద్ర శ్రీరామ్మూర్తి, దొరబాబు, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రై ఫ్రూట్స్ షాపులో రూ.40 వేలు చోరీ

నర్సీపట్నం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని వీకేఎంఎల్ కిరాణా, డ్రై ఫ్రూట్స్ షాపులో రూ.40 వేలు నగదు చోరీ జరిగిందని యజమాని గ్రంధి వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ గోవిందరావు తెలిపారు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి షాపు వెనక వైపు నుంచి గోడ దూకి లోపలకు ప్రవేశించి ఇనుప ఊసతో తలుపు తెరిచాడని తెలిపారు. సీసీ ఫుటేజీ ఆధారంగా చోరీ చేసిన వ్యక్తిని గుర్తించామన్నారు. క్లూజ్ టీమ్ సిబ్బంది వేలి ముద్రలు సేకరించారన్నారు. మంగళవారం షాపు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఎస్ఎఫ్ఐ మహాసభలను విజయవంతం చేయండి

నర్సీపట్నం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13, 14 తేదీలలో ఎలమంచిలిలో జరిగే ఎస్ఎఫ్ఐ 3వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని డివిజన్ నాయకుడు గౌతమ్ పిలుపునిచ్చారు. బుధవారం విద్యార్థులకు కరపత్రాలు పంచి, ప్రచారం చేశారు.

నేడు జిల్లా స్థాయి విలువిద్య పోటీలు

పరవాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ ఆర్చరీ మైదానంలో గురువారం ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి సబ్ జూనియర్ ఆర్చరీ (విలు విద్య) చాంపియన్‌షిప్ పోటీలు, ఎంపికలను నిర్వహించనున్నట్టు ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

నియోజకవర్గంలో ఓ ప్రాజెక్టుకు రెడ్డి సత్యనారాయణ పేరు పెట్టాలి

స్పీకర్ అయ్యన్న దృష్టికి తీసుకువెళ్లిన ఎమ్మెల్యే బండారు

చీడికాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగాను, రాష్ట్ర మంత్రిగాను, వివిధ పదవులు చేసి నియోజకవర్గం అభివృద్ధికి ఎంతో కృషిచేసిన మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ పేరున ఏదో ఒక ప్రాజెక్టుకు పెట్టాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని కోరారు. బుధవారం పెదగోగాడ గ్రామంలో జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ, ఈ విషయమై సంతాప సభలో పలువురు వక్తలు, నియోజకవర్గ అభిమానులు ఏకగ్రీవంగా తీర్మానించారని అయ్యన్నకు వివరించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లే బాధ్యత తీసుకోవాలని కోరారు. అలాగే ఈ సభలో పాల్గొన్నకొల్లి సత్యంబాబు మాట్లాడుతూ, రెడ్డి సత్యనారాయణ కాంస్య విగ్రహం గ్రామంలో ఏర్పాటుచేయాలని, దీనికి తనవంతుగా రూ.50 వేలు విరాళం అందజేస్తానని తెలిపారు.

వరి పంటను రైతులు సంరక్షించుకోవాలి

▸▸ జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు



మేడివాడలో వరి రైతులకు సూచనలు ఇస్తున్న మోహన్‌రావు

రావికమతం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ఆవర్తన కొనసాగుతున్నందున వరి పంటను రైతులు సంరక్షించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. మండలంలోని మేడివాడ గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రైతులను కలిశారు. ఇప్పటికే కోతలు కోసిన వరిని చిన్న చిన్న కుప్పలుగా వేసుకోవాలని ఈ సందర్భంగా వారికి సూచించారు. మరో మూడు రోజుల వరకు కోతలు ఎట్టి పరిస్థితుల్లోనూ కోయవద్దని, కోతలు తాత్కాలికంగా రైతులు వాయిదా వేసుకోవాలని చెప్పారు. మినప పంట పంటకు బీమా సౌకర్యం ఉన్నందున ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం రావికమతంలో ఓ ఎరువుల దుకాణం తనిఖీ చేశారు. ప్రతీ కొనుగోలుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాధికారి డి.రూప పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలను మెరుగుపర్చండి

▸▸ డిప్యూటీ డీఈవో అప్పారావు

రోలుగుంట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యా ప్రమాణాలను మెరుగుపర్చడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిప్యూటీ డీఈవో పి.అప్పారావు ఆదేశించారు. మండలంలోని రత్నంపేట, బీబీపట్నం పాఠశాలను బుధవారం సందర్శించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న బోధన తీరుపై ఆరా తీశారు. రత్నంపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల వర్క్ బుక్‌లను పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. చదవడం, రాయడంలో బాగా వెనుకబడి ఉండడాన్ని గుర్తించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో అభ్యసన నైపుణ్యాలు పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను కోరారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని, వచ్చే ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం సాధించేలా ఇప్పటి నుంచే ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని బీబీపట్నం జడ్పీ పాఠశాలలో హెచ్ఎంను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఉపాధికి నైపుణ్య శిక్షణ శిబిరం

▸▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఉపాధి కల్పనకు ప్రభుత్వం నైపుణ్య శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. జాలంపల్లి పంచాయతీ పరిధిలోని కామకూటం గ్రామంలో బుధవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ గీతం విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆరోహన్ ట్రైబల్ సొసైటీ గిరిజనులకు శిక్షణ అందించే భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలైన గొప్పులపాలెం, లోవకొత్తపల్లి, లోవకృష్ణాపురం, కామకూటం గ్రామాలలో లభ్యమయ్యే అరటిచెట్లు, అరటి బొదెల నుంచి నారతీయడం, వాటితో ఉపయోగకరమైన వస్తువులు తయారీపై మహిళలకు శిక్షణ ఇవ్వడం చెప్పారు. ఈ అవకాశాన్ని గిరిజన మహిళలు సద్వినియోగం చేసుకుని ఉపాధిని పొందాలని సూచించారు. కార్యక్రమంలో గీతం యూనివర్శిటీ, ఆరోహన్ ట్రైబల్ సొసైటీ, గీతం యూనివర్శిటీ కోఆర్డినేటర్లు, ప్రతినిధులు పి.కల్యాణ్, అప్పారావు, సురేశ్ పట్నాయక్, అశ్విన్, ఎంపీడీవో కొంకి అప్పారావు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ పీఎల్.సతీష్‌కుమార్, ఏపీవో జె.మురళీకృష్ణ, వీఆర్వోలు వనం అప్పారావు, డి.భవానీ, టెక్నికల్ అసిస్టెంట్ డి.జగదీష్‌కుమార్, ఈసీ కె.ఉమాశంకర్ కూటమి నాయకులు పుప్పాల అప్పలరాజు, అద్దేపల్లి జగ్గారావు, ఉందూరు దేముడు, పుప్పాల రమేశ్, వడ్డి రాజ్‌కుమార్, జెర్రిపోతుల సూర్యనారాయణ, సుంకరి సింహాచలంనాయుడు, పెంటకోట జగన్నాథరావు, గంగరాజు, పల్లా నాయుడు, ఉగ్గిన శ్రీనివాసరావు, యన్నంశెట్టి సత్యారావు, గండిపడాల సంతోశ్ మాడిసి సన్యాసిరావు, అనపగడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

20 నెలలుగా అందని జీతం..

▸▸ స్పందనలో ఫిర్యాదు చేసిన గ్రీన్‌గార్డు చెల్లయ్యమ్మ



పారిశుధ్య కార్మికులతో పనిచేయిస్తున్న గ్రీన్‌గార్డు చెల్లయ్యమ్మ


చీడికాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచాల గ్రామ పంచాయతీలో గ్రీన్‌గార్డుగా పనిచేస్తున్న తనకు 20 నెలలుగా జీతం ఇవ్వకుండా పంచాయతీ అధికారులు, పాలకవర్గ సభ్యులు ఇబ్బందులు పెడుతున్నారని గ్రీన్‌గార్డు మామిడి చెల్లయ్యమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అనకాపల్లి జిల్లా స్పందనకు ఫిర్యాదు చేశానని బుధవారం విలేకరులకు తెలిపారు. పంచాయతీలో శివారు ఎం.గదబూరు గిరిజన గ్రామానికి చెందిన తాను భర్త చనిపోవడంతో ఒక కుమార్తెతో జీవనం సాగిస్తున్నానని, తనను గత పంచాయతీ పాలకవర్గం గ్రీన్‌గార్డుగా నియమించిందని చెప్పారు. కొన్నాళ్ల వరకు జీతాలు బాగానే ఇస్తున్నా పంచాయతీ అధికారులు 20 నెలలుగా జీతం ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. ఉప సర్పంచ్‌తో పాటు ఆరుగురు వార్డు సభ్యులు తనకు రావాల్సిన జీతం బకాయిలను వెంటనే ఇవ్వాలని పంచాయతీ పుస్తకంలో తీర్మానం కూడా చేశారన్నారు. అయినా అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని, జిల్లా అధికారులు స్పందించి జీతం అందించాలని ఆమె విన్నవించారు.

పంచాయతీ కార్యదర్శి ఏమన్నారంటే...

ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ఎం.వనితను వివరణ కోరగా, గ్రీన్‌గార్డుగా పనిచేస్తున్న చెల్లయ్యమ్మ కొన్నాళ్లుగా సమయపాలన పాటించడం లేదన్నారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు మంచాల రావాలని, సాయంత్రం 6 గంటల వరకు ఉండాలని, అలాగైతే పనిచేయాలని పంచాయతీ సమావేశంలో తీర్మానం కూడా చేశారని చెప్పారు. వారానికి మూడు రోజులు మాత్రమే వస్తున్నారని, అది కూడా ఉదయం 10 గంటలకు వస్తున్నారని ఆమె తెలిపారు. అందువల్ల జీతం నిలుపుదల చేశామని, సమయపాలన పాటించి ఆమె సక్రమంగా పనిచేస్తే దఫదఫాలుగా జీతం అందజేస్తామని ఆమె వివరించారు.

ప్రజా సమస్యలపై స్పందించే నాయకుడు రాజు

రాజు జన్మదిన వేడుకల్లో స్పీకర్ అయ్యన్న.. భారీగా హాజరైన కూటమి నేతలు



రాజుకు శుభాకాంక్షలు అందచేస్తున్న స్పీకర్ అయ్యన్న.. పక్కన ఎమ్మెల్యే రాజు

చోడవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజా సమస్యలపై స్పందించే నాయకుడు జనసేన నియోజకవర్గ ఇంచార్జి పీవీఎస్ఎన్ రాజు అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పారు. పట్టణంలో బుధవారం జరిగిన రాజు జన్మదిన వేడుకల్లో స్పీకర్ పాల్గొని మాట్లాడారు. నాడు వైసీపీ నిరంకుశ పోరాటాలకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించడం, జనసేన తరఫున కూటమి ప్రభుత్వం తరఫున కార్యక్రమాలు నిర్వహించడంలో రాజు చూపించిన చొరవ అభినందనీయమన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ఆయన చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమని ప్రశంసించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి రాజుకు శుభకాంక్షలు తెలిపారు.స్థానిక జనసేన కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, జనసేన విశాఖ పశ్చిమ, పాయకరావుపేట నియోజకవర్గాల ఇన్‌చార్జులు దుర్గా ప్రశాంతి, గెడ్డం బుజ్జి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ బి.శివదత్, టీడీపీ నాయకులు చింతకాయల విజయ్, తెలుగురైతు ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, జనసేన నాయకులు సిరిపురపు రమేశ్, అల్లం రామప్పారావు, గూనూరు మూలినాయుడు, కర్రి రమేష్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందర్ప రమణమూర్తి, రాజేశ్వరరావు, నాలుగు మండలాలకు చెందిన జనసేన నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాది కొలగాని సతీశ్‌రాజు జనసేనలో చేరారు.

నీటి సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

మాడుగుల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలకు బుధవారం జలవనరుల శాఖ ఏఈ భార్గవ్‌కుమార్ నోటిఫికేషన్ జారీ చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని సచివాలయాల్లో ఆయా అధికారులతో జారీ అయిన నోటిఫికేషన్‌ను బోర్డులో ఏర్పాటుచేశారు. పెద్దేరు, తారకరామా, ఉరకగెడ్డ, గొర్రిగెడ్డ, పాలగెడ్డ జలాశయాల పరిధిలో రాచకట్టులు ఉన్నాయి. నీటి సంఘాల అధ్యక్షులుగా పోటీ చేసేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు నాయకులు హోరాహోరీగా పోటీపడుతున్నాయి. కొన్నిచోట్ల ఈ ఎన్నికలు ఉత్కంఠభరితంగా జరగనున్నాయని రైతులు అభిప్రాయపడుతున్నారు.

నేటి నుంచి శిక్షణ కార్యక్రమాలు

చోడవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజాప్రతినిధులకు, వివిధ శాఖల సిబ్బందికి స్థానిక సంస్థల సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి గురువారం నుంచి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో పీవీఎస్‌జే ఆంజనేయులు తెలిపారు. మొదటి రోజు సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. అలాగే 13న వీఆర్వోలకు, పంచాయతీ గ్రేడ్-6 కార్యదర్శులు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్, వెటర్నరీ, ఫిషరీస్ అసిస్టెంట్లకు, 17న మహిళా సంక్షేమ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వ్యవసాయ, ఉద్యాన శాఖ ఉద్యోగులకు, 18న ఏఎన్ఎంలకు, సర్వే అసిస్టెంట్‌లకు శిక్షణ ఇస్తారన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చోడవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపురాజుపేట పంచాయతీలో ఉపాధి నిధులతో చేపడుతున్న రోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, సర్పంచ్ రామునాయుడు, నాయకులు రాజుబాబు, మళ్ల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించుకోండి

రోలుగుంట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ నాగమ్మ కోరారు. మండలంలోని శరభవరంలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐదేళ్లుగా పరిష్కారం కాని భూసమస్యలకు ఈ సదస్సుల్లో పరిష్కారం లభిస్తుందన్నారు. గతంలో నిర్వహించిన రీ సర్వేలో మార్పులు, చేర్పులు ఉంటే కూడా అర్జీలను సమర్పించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామమూర్తి పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి సహకరించాలి

చీడికాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో నూతనంగా నిర్మించే సీతారాములవారి ఆలయం నిర్మాణానికి తహసీల్దార్ వైవీఎస్.ప్రసాద్ సహకరించాలని జి.కొత్తపల్లి సర్పంచ్ కొల్లి సూరి నాయుడు కోరారు. జి.కొత్తపల్లి గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. గ్రామంలో ఉన్న రామాలయం శిథిలావస్థకు చేరడంతో తొలగించామని, నూతన దేవాలయానికి కొంత స్థలం అవసరమని, ఆ పక్కనే ఓ ప్రైవేట్ వ్యక్తుల నుంచి స్థలం తీసుకుంటు న్నామని చెప్పారు. ఇందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొల్లి పైడంనాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రైతుల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు తీసుకున్నారు.

డీలర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

దేవరాపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు పంచాయతీల్లో రేషన్ డిపోల డీలర్ పోస్టులకు ఈ నెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పి.లక్ష్మీదేవీ తెలిపారు. దేవరాపల్లి (ఈడబ్ల్యుఎస్ మహిళ), నాగయ్యపేట (ఓసీ మహిళ), కాశీపురం (ఓసి), కలిగొట్ల (ఎస్సీ) ఖాళీలు ఉన్నట్టు చెప్పారు. ఈ నెల 13వ తేదీ సాయంత్రంలోగా ఆర్డీవో కార్యాలయానికి హాజరుకావాలని చెప్పారు. 26న రాత పరీక్ష, 27న ఇంటర్వ్యూ జరుగుతుందన్నారు.


ఇటీవల వరద నీటి ఉధృతికి సీలేరు సమీపంలో కోతకు గురైన రోడ్డు


డొంకరాయి జలవిద్యుత్ కేంద్రం సమీపంలో రెయిలింగ్ లేని వంతెన

ప్రమాదకర స్థితిలో కల్వర్టులు

- సీలేరు నుంచి డొంకరాయి వెళ్లే ప్రధాన మార్గంలో పలుచోట్ల శిథిలం
- విరిగిన రెయిలింగ్‌లు
- పట్టించుకోని ఆర్అండ్‌బీ

సీలేరు, డిసెంబరు 11, (ఆంధ్రజ్యోతి): సీలేరు నుంచి డొంకరాయి వెళ్లే ప్రధాన మార్గంలో పలుచోట్ల కల్వర్టులు శిథిలావస్థకు చేరుకోవడంతోపాటు ఇరువైపులా రక్షణగా నిర్మించిన రైలింగ్‌లు విరిగిపోయి ప్రమాదభరితంగా మారాయి. ఈ స్థితిలో కల్వర్టుల వద్ద ఆర్అండ్‌బీ అధికారులు కనీసం హెచ్చరికల బోర్డులను కూడా ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ కల్వర్టుల వద్ద కొత్త వారు ఎవరైనా ప్రయాణిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీకేవీధి మండలం సీలేరు నుంచి డొంకరాయి, భద్రాచలం, రాజమండ్రి వెళ్లే ప్రధాన రహదారిలో సీపీహెచ్ క్యాంప్ మొదటి పలుపు వద్ద గత సెప్టెంబరు 9 వతేదీన తుఫాన్ కారణంగా ఎగువన కురిసిన భారీ వర్షానికి రోడ్డు పక్కనే ఉన్న చిన్నగెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో రోడ్డుకింద భాగం కోతకు గురై ప్రమాదంగా మారింది. ఇది జరిగి మూడు నెలలవుతున్నా ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం రోడ్డు కోతకు గురైన ప్రదేశంలో హెచ్చరిక బోర్డును కూడా ఏర్పాటు చేయలేదు.. దీంతో జెన్‌కో అధికారులు, కార్మికులు చొరవ తీసుకుని రోడ్డు కోతకు గురైన ప్రదేశంలో ప్రమాదాలు జరగకుండా స్తంభాలు పాతించి వాటికి ఎరుపు రంగు గుడ్డలను చుట్టారు. అలాగే, సీలేరు నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో (జలవిద్యుత్ కేంద్రం సమీపంలో) గల వంతెన 60 ఏళ్ల నాటిది కావడంతో ప్రస్తుతం ప్రమాదకరస్థితికి చేరుకుంది. ఈ వంతెనకు ఇరువైపులా రక్షణగా ఉండే ఐరన్ రెయిలింగ్ కూడా ఓ వైపు బాగా దెబ్బతిని వాహనాలకు భద్రత లేకుండా ఉంది. ప్రమాదవశాత్తు వాహనాలు ఇక్కడ అదుపుతప్పితే లోయలో పడి పెను ప్రమాదం సంభవించే అవకాశాలున్నాయి. ఇటువంటి ప్రమాదకరమైన వంతెనల వద్ద ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతు చేపట్టకపోగా, కనీసం హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా స్పందించి సీలేరు సమీపంలో వంతెనల పునర్నిర్మించాలని కోరుతున్నారు. ఇతరచోట్ల ప్రమాద హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

మళ్లీ వణికిస్తున్న చలి

- క్రమంగా పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- జీకేవీధిలో 13.2 డిగ్రీలు నమోదు


చింతపల్లి-పాడేరు మార్గంలో కురుస్తున్న మంచు

చింతపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో చలి తీవ్రత మళ్లీ పెరిగింది. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల ప్రభావం వల్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. బుధవారం గూడెంకొత్తవీధిలో 13.2, చింతపల్లి, 13.8డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. ఉదయం, రాత్రి వేళల్లో మంచు దట్టంగా కురుస్తున్నది. ఈ నెలాఖరుకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింతగా తగ్గే అవకాశం ఉన్నదని శాస్త్రవేత్తలు తెలిపారు.

నర్సింగ్ అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు

పాడేరురూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బీఎస్సీ నర్సింగ్ చదివిన వారికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ , యూసఫ్ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో సౌదీ అరేబియాలో నర్సింగ్ ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారిణి పి.రోహిణి ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 40 ఏళ్లలోపు వయసుగల అభ్యర్థులు ఈ నెల 15 లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 78 వేల నుం చి రూ. 89 వేల వేతనం, బెనిఫిట్ మెడికల్ ఇన్సూరెన్స్, ఇతర అలవెన్స్‌లు ఉంటాయన్నారు. అభ్యర్థులు ఫోన్: 99888 53335, 99499 27899లకు సంప్రదించాలని ఆమె సూచించారు.

గిరిజన గ్రామాల్లో పశుగణన

- పశుసంవర్ధక శాఖ ఏడీ చంద్రశేఖర్


పశుగణను పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ ఏడీ

చింతపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో 21వ జాతీయ పశుగణన సర్వే చేపడుతున్నట్టు స్థానిక పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం మండల పరిధి పెదబరడలో చేపడుతున్న పశుగణన సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ మూడు మండలాల్లో 46మంది సిబ్బంది పశుగణన సర్వే నిర్వహిస్తున్నారన్నారు. ఈ సిబ్బంది మూడు మండలాల్లోని 554 గ్రామాల్లో 52,972 కుటుంబాలను సందర్శించి పశువుల సంఖ్య, మేలి జాతి, సంకరజాతి పశువులు, కుటుంబ యజమాని, ఆదాయం వివరాలు తీసుకుని పశువులకు గుర్తింపు ట్యాగ్‌లను అమర్చుతున్నారన్నారు. ఈ పశుగణను ఫిబ్రవరి 28 వరకు నిర్వహిస్తామన్నారు. ఇప్పటి వరకు మూడు మండలాల్లో 13,440 కుటుంబాలకు సర్వే పూర్తయిందన్నారు. ప్రజలు సహకరించాలన్నారు. గోకులం షెడ్లు కోసం 300మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు చాలిని, దమయంతి పాల్గొన్నారు.

హౌస్ హోల్డ్ సర్వే వేగవంతం : ఎంపీడీవో


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

చింతపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ పరిధిలో హౌస్ హోల్డ్ సర్వేను వేగవంతం చేయాలని స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి కుటుంబానికి హౌస్ హోల్డ్ సర్వే చేయాలన్నారు. అలాగే, బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. తరచూ వసతి గృహాలను సందర్శించాలన్నారు. సిటిజన్ మిస్ మ్యాచింగ్, పీసా గ్రామ సభలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 12, 13, 17,18 తేదీల్లో నిర్వహించే స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ తరగుతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

తహసీల్దార్ చొరవతో భూ వివాదం పరిష్కారం


రెండు కుటుంబాల మధ్య వివాదానికి కారణమైన భూమి పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రెండు కుటుంబాల మధ్య నెలకొన్న భూవివాదాన్ని స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ పరిష్కరించారు. గ్రామంలో నివాసముంటున్న గుడుతూరి వెంకటరావు, మామిడి బాలయ్య కుటుంబాల మధ్య కొన్ని రోజులు భూవివాదం కొనసాగుతున్నది. ఇరుకుటుంబ సభ్యులు భూమి విషయమై ఘర్షణ పడుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌ని ఆశ్రయించగా బుధవారం పోలీసులతో కలిసి ఆయన ఆ స్థలాన్ని సందర్శించారు. రెండు కుటుంబాలతో చర్చించి కౌన్సెలింగ్ చేశారు. రెవెన్యూ రికార్డు ఆధారంగా భూ సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అప్పలసూరి, ల్యాండ్ రీసర్వే డీటీ దుమంతి సత్యనారాయణ, వీఆర్వో వసుపరి లింగాలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ పార్కులో మద్యం సీసాలు తొలగింపు

- 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్


విగ్రహం ఎదుట మద్యం సీసాలు తొలగించిన దృశ్యం

పెదబయలు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ పార్కులో అంబేడ్కర్ విగ్రహం ఎదుట మద్యం సీసాలను పంచాయతీ సిబ్బంది తొలగించి శుభ్రం చేశారు. బుధవారం 'రాజ్యాంగ నిర్మాతా మన్నించు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' లో ప్రచురించిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. దేశానికి రాజ్యాంగం రచించిన మేధావి, బడుగుబలహీన వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన అంబేడ్కర్ విగ్రహం పరిసరాల్లో అసాంఘిక పనులు చేపట్టకుండా చూడాలని అంబేడ్కర్ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. పార్కు పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

ఉత్తమ సేవా కార్యకర్తగా రామకృష్ణ ఎంపిక


రామకృష్ణ

పాడేరురూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడంతోపాటు పేదలకు సాయం అందిస్తూ ఉదారతను చాటుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లా రామకృష్ణను నమో యాప్ జాతీయ బృందం అభినందిస్తూ అల్లూరి జిల్లా ఉత్తమ సేవా కార్యకర్తగా గుర్తించి బుధవారం సర్టిఫికెట్ జారీ చేసింది. పార్టీ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలను నమో యాప్ నమోదులో రామకృష్ణ 41 వేల సంఖ్యలో నిలిచారు. ఈ నేపథ్యంలో 2024 సంవత్సరానికి ఉత్తమ సేవా కార్యకర్తగా నిలిచారు. ఆయనను జిల్లా బీజేపీ నాయకులు పాంగి రాజారావు, సాగిన సింహాచలం, పెనుమాక రవికుమార్, పాంగి రవిచంద్ర, పాపిటి రాజు, ఆర్.కళ్యాణం అభినందించారు.

నీటి సంఘాల ఎన్నిక షెడ్యూల్

అనంతగిరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈనెల 14న పెదకోట, పినకోట, భీంపోల్, గుమ్మకోట పంచాయతీల్లో నీటి సంఘాల ఎన్నికల జరుగుతుందని, ఆయా పంచాయతీల ప్రజలకు గమనించాలని, తహసీల్దార్ వీ.మాణిక్యం, బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా పంచాయతీల సర్పంచ్లు, ఎంపీటీసీలు, ముఖ్యనాయకులు, ప్రజలకు పాల్గొని, నీటి సంఘాల ఎన్నిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, కోరారు.

ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీ ఎంపిక


మండల నూతన కమిటీ సభ్యులు

పాడేరురూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మండల కమిటీ ఎన్నికలు బుధవారం నిర్వహించారు. మండల అధ్యక్షులుగా అభి, శైలు, మండల కార్యదర్శులుగా సింహాద్రి, శాలిని, కమిటీ సభ్యులుగా అశ్విని, అభిజ్ఞానశ్రీ, మణి, శ్యామ్, అజిత్, యశ్వంత్, వసంత్, వాసు, మాధురి, లక్ష్మి, శరత్, కృష్ణ, రాధ, శ్రీదేవి, వసు, శైలు, మత్స్యరాజు, నగేశ్, కొండమ్మ, జగన్, రవి, ఇందు ఎంపికయ్యారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

14న గుమ్మిరేవుల, చెక్కలమద్దిల్లో నీటి సంఘాల ఎన్నిక


తహసీల్దార్ కార్యాలయం వద్ద నోటీసు అతికిస్తున్న అధికారులు

సీలేరు, డిసెంబరు 11 , (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి గుమ్మిరేవుల , చెక్కలమద్దిలలో నీటి సంఘాల ఎన్నికను ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్నట్టు జీకేవీధి మండలం తహసీల్దార్ టి. రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక మండల కార్యాలయంలో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. గుమ్మిరేవుల, చెక్కలమద్ది పోలింగ్ కేంద్రాల్లో అతికించినట్టు చెప్పారు. గతంలో నీటి సంఘాల ఎన్నికల జాబితాను ప్రకటించినట్టు చెప్పారు. ఈ ఎన్నికలకు సంబంధించి పో లింగ్ అధికారులకు శిక్షణా తరగతులు పూర్తయ్యాయని తెలిపారు. 14న పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 8 గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుందన్నారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య ఎన్నిక నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మహదేవ్, ఆర్ఎస్ డీటీ దుమంతి సత్యనారాయణ, వీఆర్వో లింగాలు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం చేపట్టక.. నిలిచిన ఇళ్ల పనులు


మాట్లాడుతున్న గిరిజనులు

ముంచంగిపుట్టు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రహదారి నిర్మాణం పనులను త్వరితగతిన ప్రారంభించాలని మండల పరిధి బరడ పంచాయతీ కొదంజోల, సగ్గులు, బిమిడి గ్రామాల గిరిజనులు డిమాండ్ చేశారు. బుధవారం ఆయా గ్రామాలకు చెందిన రామో, రాంచందర్, తిరుపతి, చిరంజీవి, శుక్ర తదితరులు మాట్లాడుతూ... తమ మూడు గ్రామాలను కలుపుతూ గల రహదారి నిర్మాణానికి నిధులు మంజూరై నెలలు కావస్తున్నా నేటికీ పనులు మొదలు కాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు వాపోయారు. ప్రధానంగా ప్రస్తుతం పీఎం జన్‌మన్ ద్వారా ఇళ్లు మంజూరైనా, రహదారి సక్రమంగా లేకపోవడంతో భవన నిర్మాణ సామగ్రిని తీసుకువెళ్లలేకపోతున్నామని వాపోయారు. హౌసింగ్ అధికారులు వచ్చి ఇళ్ల కొలతలు ఇవ్వడంతో వీటి నిర్మాణానికి అష్టకష్టాలుపడుతున్నామని ఆవేదనవ్యక్తం చేశారు. అధికారులు స్పం దించి త్వరగతిన రహదారి పనులు జరిగే విధంగా చూడాలని వారు కోరారు.

రైతులకు రుణాలు పంపిణీ చేయాలి

చింతపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులకు వ్యవసాయ రుణాలు పంపిణీ చేయలని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు వెంటనే రైతు భరోసా పంపిణీ చేయాలన్నారు. అలాగే, రైతులకు బ్యాంక్‌ల ద్వారా రుణాల పంపిణీకి ఐటీడీఏ, కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. మరమ్మతులకు చెక్ డ్యామ్‌లను మరమ్మతులు చేపట్టి పొలాలకు పూర్తి స్థాయిలో నీరు అందించాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. పసుపు, మిరియా పంటలకు సైతం కాఫీ తరహాలో మార్కెటింగ్ సదుపాయం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, వైస్ ఎంపీపీలు సాగిన వెంగళరావు, గోపీనాయక్ శారద, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

పాడేరురూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 12, 13వ తేదీలలో మండలాభివృద్ధి కార్యాలయంలో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై శిక్షణను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండలస్థాయి అధికారులు పాల్గొనాలన్నారు.

అనంతగిరి: పంచాయతీల అభివృద్ధిపై ఈనెల 12, 13 తేదీల్లో రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఏవీవీ కుమార్ తెలిపారు. పేదరికం రహిత సమాజం, ఆరోగ్యకరమైన గ్రామం, పిల్లలు స్నేహపూర్వక గ్రామం, తాగునీటి సమస్య, పచ్చదనం పరిశుభ్రత, స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పన, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళా స్నేహ పూర్వక సమాజం తదితర అంశాలపై శిక్షణ ఉంటుదని, తెలిపారు. గురువారం వేంగడ, ఎగువశోభ, బొర్రా, టోకూరు, కొండిబ, పైనంపాడు, వాలసీ, గుమ్మ, లంగుపర్తి, పెదబిడ్డ, కోనాపురం పంచాయతీలు నుంచి సర్పంచులు, సచివాలయం కార్యదర్శులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

పెదబయలు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఇన్‌చార్జి తహసీల్దార్ జి.రంగారావు కోరారు. బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 23 పంచాయతీల్లో 271 రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 13 నుంచి వచ్చే జనవరి 10వ వరకు ఈ సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సుల నిర్వహణకు డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన పి. వేణుగోపాల్ పర్యవేక్షణ అధికారిగా నియమితులయ్యారన్నారు. ఆర్ఐ పూర్ణయ్య, వీఆర్వో అజాద్, వీఆర్ఏ సుందర్‌దేవ్ పాల్గొన్నారు.

చింతపల్లి మండలంలో...

చింతపల్లి: మండలంలోని గిరిజన గ్రామాల్లో ఈనెల 13 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ రవి కుమార్ తెలిపారు. మండలంలోని 180 గ్రామాల్లో నిర్వహించనున్న ఈ సదస్సుల్లో భూముల సంబంధిత సమస్యలపై ప్రజలు అర్జీలు అందించాలని కోరారు. జనవరి 10వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

అనంతగిరి ..

అనంతగిరి: మండలంలోని ఈ నెల 13 తేది నుంచి జనవరి 10 వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ వి.మాణిక్యం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 13 తేదీన కొనాపురం, బొర్రా పంచాయతీలు, 18న కొండిబ, 16న అనంతగిరి, 17న లంగుపర్తి, 19న వాలసీ, 20న గుమ్మ, 21న టోకూరు, 23న పెదబిడ్డ, 24న కాశీపట్నం, 26న చిలకలగెడ్డ, 27న కొత్తూరు, 28న ఎన్ఆర్‌పురం, 30న జీనబాడు, 31న పినకోట, జనవరి 2న పెదకోట, 3న కివర్ల, 4న వేంగడ, 5న పైనంపాడు, 6న ఎగువశోభ, 7న భీంపోల్, 8న గుమ్మకోట, 9న గరుగుబిల్లి, 10న రొంపల్లి ఆయా పంచాయతీల్లో ఉదయం 9 గంటల నుంచి 5 గంటలకు జరుగుతాయన్నారు.

పాడేరు..

పాడేరురూరల్: మండలంలో ఈనెల 13వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ వంజంగి త్రినాదరావు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 26 పంచాయతీల సచివాలయ పరిధిలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు సదస్సులు నిర్వహిస్తామన్నారు. 13న పాడేరు సచివాలయ పరిధిలోని పాత పాడేరులో, 14న గుత్తులపుట్టు పంచాయతీ గబ్బంగిలో, 16న ఉదయం మినుములూరులో, మధ్యాహ్నం మోదాపల్లి గ్రామంలో, 17న ఉదయం డోకులూరు పంచాయతీ డి.గొందూరులో, మధ్యాహ్నం కాడెలిలో, 18న ఇరడాపల్లి సచివాలయం పరిధిలోని బడిమెల, 19న ఉదయం తుంపాడ, కిండంగి సచివాయలంలో, మధ్యాహ్నం వంతాడపల్లిలో, 20న వంజంగిలో, 21న ఈ సదస్సులు నిర్వహిస్తామన్నారు.

ఘనంగా దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవం


విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న విశ్వ హిందు పరిషత్ ప్రతినిధులు, భక్తులు


కోలాటం ప్రదర్శనలో మహిళలు

పాడేరురూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాడేరు గొందూరు గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు నిధులతో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవం విశ్వహిందూ పరిషత్ గిరిజన అర్చక సంఘం అధ్యక్షుడు కూడా రామకృష్ణ పరమహంస ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో హోమాలను నిర్వహించారు. బుధవారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా భక్తబృంద ప్రతినిధులు కోలాటం, భక్తి గీతాలాపన చేపట్టారు.

అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. మన్యంలోని వివిధ మండలాల గిరిజన అర్చకులు, ఆలయ ప్రతినిధులు లక్ష్మణ్, అప్పారావు, వరలక్ష్మి, రాధ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తుంది'ని సద్వినియోగం చేసుకోవాలి


పొలంబడిలో ఏవో శ్రీనివాస బాబు

ముంచంగిపుట్టు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని గిరిజన రైతులుసద్వినియోగం చేసు కోవాలని ఏవో శ్రీనివాస బాబు సూచించారు. బుధవారం మండలంలోని కరిముఖిపుట్టు, కించాయిపుట్టు పంచాయతీల పరిధిలో అవగాహన కల్పించారు. వరి, చోడిలో నూతన వంగడాలసాగు ఆవశ్యకత, భూసార పరిరక్షణ, పెరటి తోటల పెంపకం వలన కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. పశు బీమా, నులిపురుగుల నివారణ, వాక్సినేషన్ కార్య క్రమాలను తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి: సీఐ


వన సమారాధనలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

గూడెంకొత్తవీధి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వర ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక ఏకలవ్య ఆదర్శ నివాసానుబంధ పాఠశాల ఆవరణలో వన సమారాధన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొని సీఐ మాట్లాడారు. గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ చదువులో రాణించాలన్నారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు బోధనలను శ్రద్ధగా పాటించాలన్నారు. క్రమశిక్షణతో మెలగాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్య కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో తహసీల్దార్ టి. రామకృష్ణ, ప్రిన్సిపాల్ ఎంవీ రమణమూర్తి పాల్గొన్నారు.

దబ్బకోటలో సీసీ రోడ్డు నిర్మాణం


దబ్బకోటలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజు

సీలేరు, డిసెంబరు 11, (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధి దబ్బకోట గ్రామంలో బుధవారం సీసీ రోడ్డు నిర్మాణాన్ని సర్పంచ్ నడిగట్ల రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 15వ ఆర్థిక సంఘం నిధులతో 100 మీటర్ల మేర ఈ రోడ్డు నిర్మాణ చేపడుతున్నట్టు చెప్పారు. నాణ్యతాలోపం లేకుండా పనులు పూర్తి చేయాలని గుత్తేదారుకి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మాడి రామన్న, వార్డు సభ్యులు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాలపై శ్రద్ధ వహించండి

డుంబ్రిగుడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రక్షిత తాగునీటి పథకాల నిర్మాణాలపై శ్రద్ధ వహించాలని జనసేన మండల అధ్యక్షుడు సీదరి దన్నేశ్వరరావు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గిరిజన గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో తాగునీటి పథకాలకు కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తున్నా, అధికారుల సమన్వయ లోపంతో గిరిజనులకు తాగునీటి పథకాలు దరి చేరడం లేదన్నారు. ఏటా కలుషిత నీటితో గిరిజనులు వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో గిరిజన గ్రామాలకు నీటి పథకాలు నిర్మించని దుస్థితి నెలకొందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీలకు నిధులు మంజూరు చేస్తోంది. ఈస్థితిలో మండల అధికారులు స్పందించి గిరిజన గ్రామాల్లో రక్షిత నీటి పథకాలకు సహకరించాలని కోరారు.

'బాధిత కుటుంబానికి పరిహారం అందేలా చర్యలు'


పెదబయలు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిముడుపల్లి పంచాయితీ గడుగుపల్లిలో ఈ నెల 9వ తేదీన విద్యుదాఘానికి లోనై తల్లి, ఇద్దరు బిడ్డలు మృత్యువాతపడడం బాధాకరమని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు బుధవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. వారికి త్వరలో ఆధార్ కార్డులు జారీ చేసేలా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతానని పేర్కొన్నారు.

ఆఖరి మజిలీకి అవస్థలే..!

ముళ్ల పొదలతో నిండిపోయిన కలపాక శ్మశానవాటిక

- అడుగు పెట్టాలంటేనే భయానకం.. వర్షా కాలంలో ప్రత్యక్ష నరకం
- అంత్యక్రియలకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

అంతిమ సంస్కారంలోనూ ప్రశాంతత కొరవడుతోంది. ముళ్ల పొదలు.. పిచ్చి మొక్కలు.. దారి కూడా లేని ప్రదేశాలు.. వెరసి కలపాక శ్మశానవాటిక దారుణంగా తయారైంది. అంత్యక్రియలు చేసేందుకు అక్కడ అడుగు పెట్టాలంటేనే గుబులు రేగుతోంది. వర్షాకాలంలో నరకాన్ని తలపిస్తోంది. అయినప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం జనాలకు రోత పుట్టిస్తోంది.



కనీసం వెళ్లడానికి దారి కూడా లేకుండా తుప్పల మధ్య ఉన్న శ్మశానవాటిక షెడ్డు

పరవాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలపాక శ్మశానవాటికలో పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. ఇక్కడ విష పురుగుల సంచారం అధికంగా ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు శ్మశానవాటికకు చెందిన షెడ్ చుట్టూ పెద్ద ఎత్తున ముళ్ల తుప్పలు పెరిగిపోవడంతో కనీసం షెడ్‌లోకి వెళ్లి కూర్చునే అవకాశం కూడా లేకపోయింది. స్నానాలు చేసేందుకు ఏర్పాటు చేసిన బోరు చుట్టూ కూడా పిచ్చి మొక్కలు చుట్టి ముట్టాయి. దీని కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. వర్షాకాలంలో అంత్యక్రియలు చేయాలంటే నరకాన్ని చవి చూడాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. కనీసం కూర్చొనేందుకు అవకాశం లేకుండా పోయింది. శ్మశానవాటిక వద్ద విద్యుత్ సౌకర్యం కూడా లేదు. ఒక్కొక్కసారి చీకట్లోనే అంత్యక్రియలు చేపట్టాల్సిన దుస్థితి దాపురిస్తోంది. ఏళ్ల తరబడి శ్మశానవాటిక అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నా ఇటు అధికారులు కాని అటు పాలకులుగాని పట్టించుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. దహన సంస్కారానికి కూడా ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శ్మశానవాటిక అభివృద్ధికి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.



బోరు చుట్టూ పేరుకుపోయిన ముళ్ల పొదలు



శ్మశానవాటిక ప్రాంగణంలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

అవస్థలు తప్పడం లేదు



అంత్యక్రియలకు అవస్థలు తప్పడం లేదు. ఏళ్ల తరబడి శ్మశానవాటిక చుట్టూ పెద్ద ఎత్తున ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయి అధ్వానంగా తయారైంది. అడుగు పెట్టాలంటేనే భయమేస్తోంది. విష పురుగుల సంచారం అధికంగా ఉంది. విద్యుత్ సౌకర్యం కూడా లేదు. అంత్యక్రియలు చేయాలంటే నరకం చూడాల్సి వస్తోంది.

-ఇందల కొండలరావు, కలపాక

అధికారులు పట్టించుకోవడం లేదు



శ్మశానవాటిక అభివృద్ధి గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. మాకెందుకులే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. శ్మశానవాటిక చుట్టూ ఉన్న ముళ్ల పొదలను తొలగించడానికి కూడా అధికారులకు ఖాళీ లేకుండా పోయింది. అంత్యక్రియలకు అవస్థలు తప్పడం లేదు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని కలపాక శ్మశానవాటిక అభివృద్ధికి సహకరించాలి.

-యర్రా నరసింగరావు, కలపాక



సచివాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

సమస్యలపై ముత్యాలమ్మపాలెం గ్రామస్థుల ధర్నా

పరవాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధి ప్రజలు బుధవారం స్థానిక సచివాలయం ఎదుట ధర్నా చేశారు. పంచాయతీ పరిధిలోని గ్రామాలన్నింటిలోనూ తాగునీటి సమస్య వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వీధిలైట్లు కొన్నిచోట్ల మాత్రమే వెలుగుతున్నాయని, పారిశుధ్యం కూడా అధ్వానంగా ఉందని వాపోయారు. దీని కారణంగా ఈగలు, దోమలు వృద్ధి చెంది అనారోగ్యం బారిన పడుతున్నామన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి రజినికి వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరిస్తామని ఆమె హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అర్జిల్లి అప్పలరాజు, పరదేశి, సమ్మంగి అప్పారావు, బొంది దుర్గారావు, సీహెచ్ ముత్యాలు, ఎస్. మహేశ్, ఎస్. అమ్మోరయ్య, బొంది ముత్యాలు, అప్పలరాజు, మహేష్, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరించుకోండి

- తహసీల్దార్ శ్రీనివాసరావు



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కశింకోట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సదస్సుల్లో భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని అచ్చెర్ల గ్రామంలో బుధవారం జరిగిన ఈ సదస్సులో ఆయన పాల్గొని రెండు అర్జీలను స్వీకరించారు. 20 రోజుల్లో సమస్యలన్నింటినీ పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రామారావు, కూటమి నాయకులు నిమ్మదల సన్యాసినాయుడు, దొడ్డి నాగేశ్వరరావు, నైనంశెట్టి రమణారావు, జాను, చిరంజీవిపాత్రుడు, సచివాలయ వీఆర్వో ఉదయ్, సర్వేయర్ రూపిత తదితరులు పాల్గొన్నారు.

వెన్నెలపాలెంలో రెవెన్యూ సదస్సు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ అంబేడ్కర్

పరవాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నెలపాలెం గ్రామంలో బుధవారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్ మాట్లాడుతూ భూములకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న వారికి 45 రోజుల్లోగా సమస్య పరిష్కారమవుతుందన్నారు. అనంతరం పలువురు రైతులు వివిధ సమస్యలపై సదస్సులో దరఖాస్తులు అందజేశారు. మొత్తం 15 దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెన్నెల అప్పారావు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సదస్సులు దోహదం



ఎల్లుప్పిలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సదస్సులు దోహదపడతాయని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ పేర్కొన్నారు. మండలంలోని ఎల్లుప్పి, బోదివలస గ్రామాల్లో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ అర్జీని ఆన్‌లైన్ చేస్తామన్నారు. నిర్దేశిత సమయంలో వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఉగ్గిన దేముడమ్మ, నేబర్తి శ్రీను, ఎంపీటీసీ సభ్యురాలు ఉగ్గిన లక్ష్మీ, సర్వేయర్లు ఎల్.అప్పారావు, రాంబాబు, శ్యాం, మౌనిషీ, వీఆర్వోలు గోవిందరావు, కామరాజు, రవి, ఈశ్వరరావు, గ్రామ నాయకులు ఉగ్గిన రాము, నాయుడు, రైతులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

సబ్బవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి జిల్లా కలెక్టర్ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల, ఇరిగేషన్ శాఖ అధికారులు గ్రామాల్లోని సచివాలయాల వద్ద రైతులకు నోటిఫికేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈ సాయికిరణ్ మాట్లాడుతూ ఈ నెల 14న ఉదయం 8 గంటల నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. అనంతరం మధ్యాహ్నం 1 గంట వరకూ ఎన్నికలు నిర్వహణ ప్రక్రియ చేపడతామని తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5 గంటల మధ్య అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం ఎన్నికల అధికారి, సహాయ ఎన్నికల అధికారి, స్థానిక వీఆర్వో తదితర సుమారు 160 మందిని ప్రభుత్వం నియమించిందన్నారు. మండలంలో ఎన్నికలు ప్రక్రియ మొత్తం పర్యవేక్షణకు ఒక అధికారి, సహాయాధికారి ఉంటారని ఆయన వివరించారు.



అయ్యన్నపాలెంలో ఎన్నికల నోటిఫికేషన్ అంటించిన ఇరిగేషన్ ఏఈ సాయికిరణ్

మహారాజా బ్యాంకును ప్రారంభించిన అశోక్‌గజపతిరాజు

కొత్తూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలోని నూతనంగా ఏర్పాటు చేసిన మహారాజా బ్యాంకును మాజీ కేంద్ర విమానయాన శాఖ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లిలో పదో శాఖను ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. బ్యాంకింగ్ సేవలో 25వ సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా అభినందనలు తెలిపారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా అనుమతితో ఏర్పాటు చేసిన ఈ బ్యాంకు సేవలు ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ బ్యాంకులో నూతనంగా ప్రవేశపెట్టిన యువ డిపాజిట్ పథకంలో 25 ఏళ్ల లోపు ఉన్నవారు చేరవచ్చునని చెప్పారు. యువతకు బ్యాంకింగ్ రంగం, ఆర్థిక విధానాలపై అవగాహన, ఆర్థిక క్రమశిక్షణ పెంపొందించడమే ఈ డిపాజిట్ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. సహకార రంగంలో ఉన్న మహారాజ కో-ఆపరేటివ్ బ్యాంకు సేవలు నూతనంగా గృహాలు నిర్మించేందుకు, పునర్నిర్మాణానికి, కుటుంబ అవసరాలకు, పిల్లల చదువుల నిమిత్తం తక్కువ వడ్డీతో బంగారు ఆభరణాలపై రుణాలు పొందవచ్చని ఆయన తెలిపారు. అనంతరం బ్యాంకు చైర్మన్ ఎం.ఆర్.కె.రాజు మాట్లాడుతూ 108 మంది సిబ్బందితో మహారాజా బ్యాంకు అభివృద్ధి చెందుతూ ఉందన్నారు. ఈ కార్యక్రమలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, సెంచూరియనర్ యూనివర్శిటీ చాన్సలర్, ఆంధ్రా యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు, ఫైడా ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ ఫైడా కృష్ణప్రసాద్, బెల్లం వ్యాపారులు ఇమిడిశెట్టి రామకృష్ణయ్య, కోరుకొండ బుచ్చిరాజు, అనుదియ స్టీల్స్ ఎల్ఎల్‌పి మేనేజింగ్ పార్టనర్ కొణతాల రఘునాథ్, బ్యాంకు జనరల్ మేనేజర్ ఎస్ఎస్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లి మహారాజా బ్రాంఛును ప్రారంభిస్తున్న అశోక్ గజపతిరాజు

సాంఘిక దురాచారాలను వ్యతిరేకించాలి

- కిశోరి వికాసం శిక్షణ శిబిరంలో ఎంపీడీవో శ్యామ్‌సుందర్

పరవాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు వంటి సాంఘిక దురాచారాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని ఎంపీడీవో ఎస్‌డీ శ్యామ్‌సుందర్ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, హైస్కూల్ ఉపాధ్యాయులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు ఆడ పిల్లలకు బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. వాటి నిర్మూలన పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. బాలికా విద్యపై దృష్టి సారించడంతో పాటు బడి మానేసిన బాలికలందరికీ బడిలో చేర్పించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఆడ పిల్లలు రుతు సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత, తీసుకోవాల్సిన ఆహారం తదితర అంశాలపై సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో లలితకుమారి అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, పోక్సో చట్టం-2012 గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు దివాకర్‌రావు, సాయిశైలజా, సీఐ మల్లికార్జునరావు, వైద్యాధికారి హారిక, వెలుగు ఏపీఎం బి.రంగారావు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో శ్యామ్‌సుందర్

కార్యకర్తల శ్రేయస్సుకే టీడీపీ సభ్యత్వ నమోదు

- పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్

కొత్తూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల శ్రేయస్సుకే టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపట్టారని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ చెప్పారు. పట్టణంలోని కస్పావీధిలో బుధవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో ప్రతీ కార్యకర్త సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. దీనివల్ల రూ.5 లక్షల ప్రమాద బీమా పొందవచ్చన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 60 లక్షల మందికి పైగా సభ్యత్వ నమోదు చేసుకున్నారన్నారు. పార్టీ బలోపేతానికి ఈ నమోదు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కోటిపల్లి జేజిబాబు, కె.శ్రీను, తణుకు రవి, అప్పలాచారి, జి.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న దాడి రత్నాకర్

పకడ్బందీగా ఎంఎస్ఎంఈ సర్వే

- మండల పరిషత్ పరిపాలనాధికారి శివరాంప్రసాద్

సబ్బవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో వచ్చే శుక్రవారం నుంచి చేపట్టనున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ) సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మండల పరిషత్ పరిపాలనాధికారి శివరాంప్రసాద్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఎంఎస్ఎంఈ సర్వేపై సచివాలయాల ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో రాష్ట్ర పరిశ్రమల శాఖ ఈ సర్వే నిర్వహిస్తుందని చెప్పారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి ఈ సర్వే సమగ్రంగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో వివరాలను నమోదు చేయాలని ఆయన సూచించారు. ఎంఎస్ఎంఈపై జరుగుతున్న ఈ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని, ఎటువంటి అనుమానాలు ఉన్నా శిక్షకులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు.



సచివాలయ, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎంఎస్ఎంఈ సర్వే 11.7 శాతం పూర్తి

- ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ నాగరాజరావు



అనకాపల్లి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) సర్వే ఇంతవరకు 11.7 శాతం పూర్తి చేసినట్టు ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ జి.నాగరాజరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 29 నుంచి ప్రారంభమైన ఈ సర్వే ద్వారా జిల్లాలోని అన్ని రంగాల్లో గల 58717 ఎంఎస్ఎంఈలను గుర్తించడం జరిగిందని చెప్పారు. ఇంతవరకు 5002 ఎంఎస్ఎంఈల సర్వే పూర్తి చేసినట్టు తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి ఒకటవ తేదీ నాటికి సర్వే పూర్తి చేస్తామన్నారు. జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, సర్వీసింగ్, వ్యాపార యూనిట్ల సంస్థలు సర్వేకి సహకరించాలని కోరారు.

20 నెలలుగా అందని జీతం..

- స్పందనలో ఫిర్యాదు చేసిన గ్రీన్‌గార్డు చెల్లయ్యమ్మ

చీడికాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచాల గ్రామ పంచాయతీలో గ్రీన్‌గార్డుగా పనిచేస్తున్న తనకు 20 నెలలుగా జీతం ఇవ్వకుండా పంచాయతీ అధికారులు, పాలకవర్గ సభ్యులు ఇబ్బందులు పెడుతున్నారని గ్రీన్‌గార్డు మామిడి చెల్లయ్యమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అనకాపల్లిలోని స్పందనలో ఫిర్యాదు చేశానని బుధవారం విలేకరులకు తెలిపారు. పంచాయతీ శివారు ఎం.గదబూరు గిరిజన గ్రామానికి చెందిన తాను భర్త చనిపోవడంతో ఒక కుమార్తెతో జీవనం సాగిస్తున్నానని, తనను గత పంచాయతీ పాలకవర్గం గ్రీన్‌గార్డుగా నియమించిందని చెప్పారు. కొన్నాళ్ల వరకు జీతాలు బాగానే ఇస్తున్నా పంచాయతీ అధికారులు 20 నెలలుగా జీతం ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. ఉప సర్పంచ్‌తో పాటు ఆరుగురు వార్డు సభ్యులు తనకు రావాల్సిన జీతం బకాయిలను వెంటనే ఇవ్వాలని పంచాయతీ పుస్తకంలో తీర్మానం చేశారన్నారు. అయినా అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని, జిల్లా అధికారులు స్పందించాలని కోరారు.

నేడు జిల్లా స్థాయి విలువిద్య పోటీలు

పరవాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ ఆర్చరీ మైదానంలో గురువారం ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి సబ్ జూనియర్ ఆర్చరీ (విలువిద్య) చాంపియన్‌షిప్ పోటీలు, ఎంపికలను నిర్వహించనున్నట్టు ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొత్తూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మున్సిపల్ హైస్కూలులో 1969-70, 71 ఏడాదిలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు పెదగంట్యాడలోని ఉన్న ట్రూత్ చారిటబుల్ ట్రస్టు అనాథాశ్రమంలో ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంహెచ్ స్కూలులో సరస్వతిదేవి విగ్రహ ప్రతిష్ఠాపన చేసి నాలుగు వారోత్సవాలు కావడంతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గతించిన మిత్రులకు నివాళులర్పించారు. అలనాటి పాఠశాల వాతావరణాన్ని నెమరవేసుకున్నారు. సమాజానికి అవసరమైన సేవా కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానం చేసుకున్నారు. అనంతరం విద్యార్థులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. ముందుగా ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజేశ్వరరావు, యిమ్మిడిశెట్టి చక్రపాణి, దుప్పాడ పార్వతీశం, శంకరరావు, బచ్చు వెంకట సూర్యనారాయణ, ఉమామహేశ్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి గ్రామాన్ని కాపాడాలి

తుమ్మపాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాలుష్యం బారి నుంచి మామిడిపాలెం గ్రామాన్ని కాపాడాలని సర్పంచ్ పూడి పరదేశినాయుడు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్యం కారణంగా గ్రామంలో పలువురు రోగాల బారిన పడుతున్నారని చెప్పారు. ప్రధానంగా కిడ్నీ సమస్యలు అధికంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామం నలువైపులా క్వారీ, క్రషర్లు ఉండడంతో సమస్య తీవ్రతరంగా ఉందన్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో తక్షణమే విచారణ చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సబ్బవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం సెక్షన్-2 పరిధిలోని 33 కేవీ ఫీడర్ పీఎంఐ (ప్రీ మాన్సూన్ ఇన్‌స్పెక్షన్) పనుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంతరాయాన్ని విద్యుత్ వినియోగదారులు గ్రహించి, తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

నేడు నియోజకవర్గ స్థాయి టీడీపీ కార్యకర్తల సమావేశం

సబ్బవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇరువాడలోని జీఎస్ కన్వెన్షన్ హాలులో గురువారం ఉదయం 10 గంటలకు పెందుర్తి నియోజకవర్గ స్థాయి టీడీపీ కార్యకర్తల సమావేశం జరుగుతుందని పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని సబ్బవరం, పరవాడ, పెందుర్తి మండలాల ముఖ్య నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ, సమన్వయ కమిటీ సభ్యులు, కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు. ఈ నెల 14న జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలు, పార్టీ సభ్యత్వ నమోదుపై పార్టీ పెందుర్తి ఇన్‌చార్జి, ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ కార్యకర్తలతో చర్చిస్తారని తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పరవాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలు దూరంగా ఉండాలని పరవాడ సీఐ మల్లికార్జునరావు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సంకల్పం పేరట మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల వల్ల బంగారు భవిష్యత్తు నాశనం కావడంతో పాటు కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయన్నారు. అలాగే సైబర్ క్రైమ్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ వంటి అంశాల గురించి తెలిపారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణారావు, హెచ్ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలకు బాసట

నూతన ఆవిష్కరణలకు అండగా ఏయూ ఐపీఆర్

- పేటెంట్ హక్కులు కల్పించేందుకు సహకారం
- ఇప్పటివరకు 450కి పైగా దరఖాస్తులు
- 154 ఆవిష్కరణలకు దక్కిన పేటెంట్స్
- దరఖాస్తు, గైడెన్స్, మార్కెటింగ్ వరకు అండగా..

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

వినూత్న ఆలోచనలు, సరికొత్త ఆవిష్కర్తలకు ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ విభాగం అండగా నిలుస్తోంది. విభిన్న ఆలోచనలతో వచ్చే వారికి సహకరించడంతో పాటు ఆవిష్కరణలకు పేటెంట్స్ (హక్కులు) కల్పించేందుకు కృషి చేస్తోంది. కొత్త ఆలోచనలకు పేటెంట్స్ తీసుకోవడంలో భారతీయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ (ఐపీఆర్) సెంటర్లను ఏర్పాటుచేసింది. ఇందులో భాగంగానే 2020లో ఏయూలో ఏర్పాటైన ఈ సెంటర్‌లో మేధోహక్కుల కోసం ఇప్పటివరకు 450 మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 154 మందికి హక్కులు దక్కేలా ఈ సెంటర్ సహాయ, సహకారాలను అందించింది. మరో 200 దరఖాస్తులు ప్రాసెస్‌లో ఉన్నాయి.

విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాలకు చెందిన ఫ్యాకల్టీ, పరిశోధకులు, పరిశోధక విద్యార్థులు, పీజీ, డిగ్రీ విద్యార్థులు ఈ హక్కులకు దరఖాస్తు చేసిన వారిలో ఉన్నారు. వర్సిటీలోని 13 విభాగాలకు చెందిన ఆవిష్కరణలకు పేటెంట్స్ దక్కాయి. ఇందులో కంప్యూటర్ సైన్స్‌అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్‌లో 31, సివిల్ ఇంజనీరింగ్‌లో 30, జువాలజీ 19, కెమికల్ ఇంజనీరింగ్ 16, కెమిస్ట్రీ 13, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ 10, ఈసీఈ 9, మెకానికల్ ఇంజనీరింగ్ ఏడు, బయో కెమిస్ట్రీ/బయో టెక్ ఏడు, ఫార్మసీ ఐదు, ఇన్‌స్ట్రుమెం ట్ టెక్ మూడు, జియో ఇంజనీరింగ్ మూడు, సైకాలజీ విభాగానికి చెందిన ఆవిష్కరణకు పేటెంట్ దక్కింది.

హక్కులు దక్కేలా కృషి..

ప్రపంచవ్యాప్తంగా భిన్న ఆలోచనలతో చేసే ఆవిష్కరణలకు పేటెంట్స్ కల్పిస్తుంటారు. ఆవిష్కరణలపై వారికి 20 ఏళ్ల పాటు హక్కులుంటాయి. అటువంటి ఆలోచనలను ఉత్పత్తిగా చేసి మార్కెట్‌లోకి తీసుకురావాలంటే తప్పనిసరిగా ఆవిష్కర్తల అనుమతి ఉండాలి. ఇందుకోసం సదరు ఉత్పత్తికి ముందుకువచ్చే సంస్థలు, కంపెనీలు ఆవిష్కర్తలకు భారీమొత్తంలో రాయల్టీని అందిస్తాయి. మన దేశంలో ఇటువంటి ఆలోచనలతో భిన్న ఆవిష్కరణలు చేసే ఎంతోమంది ఉన్నారు. కానీ ఆ ఆలోచనలకు పేటెంట్స్ తీసుకోవడంలో అవగాహన లేకపోవడంతో ఇబ్బంది ఎదురవుతోంది. దీంతో ఇతర దేశాలకు చెందిన వారు ఇదే తరహా ఆలోచనలతో ఆవిష్కరణలు చేసి పేటెంట్స్ పొందుతున్నారు. దీనివల్ల ఎంతోమంది ఆవిష్కరణలపై హక్కులను కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఇటువంటి ఇబ్బందులకు చెక్ చెప్పాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టింది. కామర్స్ అండ్ ఇండస్ట్రీ మంత్రిత్వశాఖ ఇందుకోసం ప్రత్యేకంగా స్పృహ పేరుతో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు దరఖాస్తు, ఇతర సహకారం అందించేందుకు అనేకచోట్ల సెంటర్ ఫర్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ (సీఐపీఆర్)ను ఏర్పాటుచేసింది. కేంద్ర మంత్రిత్వశాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రమోషన్ ఫర్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ విభాగం స్పృహ అమలు బాధ్యతను చూస్తోంది. వర్సిటీలోని సీఐపీఆర్ నాలుగేళ్లుగా పనిచేస్తోంది.





ఐపీఆర్ కార్యాలయం

ఇదీ సహకారం..

భిన్న ఆవిష్కరణలు చేసేవారికి సీఐపీఆర్ సహకారాన్ని అందిస్తుంది. విద్యార్థులు, ఫ్యాకల్టీ, పరిశోధకులకు అవగాహన కల్పించడంతో పాటు ఆలోచనకు హక్కులు పొందడంపై అవగాహన కల్పిస్తారు. భిన్న ఆలోచనతో వచ్చే విద్యార్థికి.. అదే ఆలోచనతో కూడిన ఆవిష్కరణ ఎక్కడైనా ఉందా..? ఉంటే దానికి హక్కు దక్కిందా..? అన్న అంశాలను డేటాబేస్‌లో వెతికి తెలియజేస్తారు. అటువంటి ఆలోచన లేదని నిర్ధారణ అయిన తరువాత న్యాయపరంగా ముందుకు వెళ్లే ప్రక్రియను వివరిస్తారు. అంటే హక్కులు దక్కించుకునేందుకు అనుగుణంగా సదరు ఆలోచనకు సంబంధించి పేటెంట్, కాపీరైట్, ట్రేడ్‌మార్క్‌ను ఫైలింగ్ చేస్తారు. ఈ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే పేటెంట్ ఆఫీస్ (ఆఫీస్ ఆఫ్ ద కంట్రోల్ జనరల్ ఆఫ్ పేటెంట్స్, డిజైన్స్ అండ్ ట్రేడ్‌మార్క్) నిర్వహిస్తుంది.

మేధోహక్కులతో ఆలోచనలకు రక్షణ



భిన్న ఆవిష్కరణలు చేసే వారికి మేధోహక్కులను పొందడం ద్వారా రక్షణ లభిస్తుంది. దేశంలో విభిన్న సమస్యలకు పరిష్కారమార్గాలను చూపించే ఆవిష్కరణలకు హక్కులు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటికి చెక్ చెప్పేందుకు కేంద్రం ఐపీఆర్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఏయూలోని సెంటర్ ద్వారా నాలుగేళ్లలో ఎన్నో ఆవిష్కరణలకు హక్కులు లభించేలా చేశాం. ఆవిష్కరణపై హక్కులతో పాటు ఆ ఉత్పత్తి మార్కెట్‌లోకి వెళితే ఆదాయం కూడా వస్తుంది. ఈ ఆలోచనకు ప్రపంచమే గుర్తింపు ఇచ్చినట్టు అవుతుంది.

- ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, చైర్ ప్రొఫెసర్ సీఐపీఆర్

సెంటర్ ఆధ్వర్యంలోనే దరఖాస్తు ప్రక్రియ



సాధారణంగా మేధో హక్కుల కోసం దరఖాస్తు చేయడానికి రూ.50 వేల వరకు ఖర్చవుతుంది. ఏయూలో ఏర్పాటుచేసిన ఈ సెంటర్ వల్ల ఒక్కరూపాయి కూడా ఖర్చు కాదు. ఇప్పటివరకు వందలాది దరఖాస్తులు వచ్చాయి. కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. 154 ఆలోచనలకు హక్కులు దక్కాయి. ఆలోచనలకు ఇతర దేశాలకు అందించడంతో పాటు వారి నుంచి తీసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాం. భిన్న ఆలోచనలు నచ్చి విదేశాల్లోనివారు పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపిస్తే ఈ ఆలోచనలను ఎగుమతి చేస్తాం. ఇక్కడ ఎవరైనా విదేశాల్లోని ఆలోచన నచ్చి వాటిపై పెట్టుబడిపెట్టి ఉత్పత్తి తయారీకి ముందుకువస్తే దిగుమతి చేసుకుంటాం. ఆవిష్కరణకు సంబంధించిన ఉత్పత్తి తయారీకి సహకరిస్తాం.

- ప్రొఫెసర్ ఎల్లపు రాంబాబు, డైరెక్టర్, సీఐపీఆర్

సామాజిక భవన నిర్మాణంలో అక్రమాలు

... 5వ పేజీ తరువాయి

మాకిరెడ్డి వరహాలబాబు, బెల్లపు కొండల రావు, తదితరులు ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు విచారణకు ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో మేరీరోజీ, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు పప్పుశెట్టిపాలెం గ్రామ సచివాలయంలో ప్రజల సమక్షంలో విచారణ చేపట్టారు. రికార్డులు పరిశీలించిన అనంతరం జమ్మాదేవిపేటలో నిర్మించిన సామాజిక భవనాన్ని సందర్శించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఎంపీడీవో తెలిపారు.

అల్పపీడనంతో అప్రమత్తం

... 5వ పేజీ తరువాయి

వాయిదా వేసుకున్నారు. రెండు, మూడు రోజుల క్రితం కోసిన వరి పైరును కుప్పలు వేసుకుంటున్నారు.

అధికార యంత్రాంగం సన్నద్ధం

తీవ్రఅల్పపీడనం ప్రభావంతో అధిక వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధమైంది.. కలెక్టరేట్‌తో పాటు అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. మండలస్థాయి అధికారులు ఎవరూ సెలవు పెట్టవద్దని, మండల కేంద్రాల్లోనే ఉండి, ప్రజలకు అవసరం మేరకు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. సముద్రంలో చేపల వేటను తాత్కాలికంగా నిషేధిస్తున్నట్టు తెలిపారు. మత్స్యకారులు రానున్న రెండు రోజులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని కలెక్టర్ పేర్కొన్నారు.

కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఫోన్ నంబర్లు 08924-226599, 222888 అందుబాటులో ఉంచారు. ఇక్కడ సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండి మండలాల్లో వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు.

నిస్వార్థ ప్రజా సేవకుడు సత్యం మాస్టారు

- దివంగత నేతను ఆదర్శంగా తీసుకోవాలి
- రెడ్డి సత్యనారాయణ సంతాప సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

చీడికాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాడుగుల నియోజకవర్గంలో జలాశయాల నిర్మాణంలో ప్రముఖపాత్ర పోషించిన ఘనత మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ దక్కుతుందని, నిస్వార్థంగా ప్రజాసేవ చేసిన 'సత్యం మాస్టారు'ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. మండలంలోని పెదగోగాడలో బుధవారం దివంగత నేత రెడ్డి సత్య నారాయణ సంతాపసభ జరిగింది. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ, ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, అంచనాల కమిటీ చైర్మన్‌గా పలు పదవులను సమర్థంగా నిర్వహించి నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. క్రమశిక్షణ, అంకితభావం, నిరాడంబరతకు ఆయన మారుపేరని అన్నారు. మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ, మాడుగుల నియోజకవర్గం అభివృద్ధిలో ఆయన కీలకపాత్ర పోషించారని అన్నారు.


మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న స్పీకర్ అయ్యన్న, ఎమ్మెల్యేలు బండారు, రాజు, తదితరులు

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్. రాజు, గణబాబు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ఉత్తరాంధ్ర వెలమ సంఘం కన్వీనర్ నరవ రాంబాబు, మాజీ మంత్రి మణికుమారి, మాజీ ఎమ్మెల్యేలు గవిరెడ్డి రామానాయుడు, కరణం ధర్మశ్రీ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల విజయ్, కురచా నరసింహనాయుడు, రెడ్డి సత్యనారాయణ కుటుంబ సభ్యులు రెడ్డి రాము, రెడ్డి అనిల్‌కుమార్, నాయకులు పాత్రిని సింహాచలంనాయుడు, పోతల రమణమ్మ, పుప్పాల అప్పలరాజు, కుచ్చు కళావతి, వేచలపు చినరామునాయుడు, గండి ముసలినాయుడు, యర్రా అప్పారావు, పైల అచ్చియ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.


అమరావతిలోని సచివాలయంలో బుధవారం సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన జిల్లా కలెక్టర్ల రెండు రోజుల సదస్సుకు హాజరైన అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

'ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయం'

కూర్మన్నపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఎంప్లాయిస్ యూనియన్ ధ్యేయమని రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. బుధవారం స్టీల్ సిటీ ఆర్టీసీ డిపోలో విశాఖ ఉమ్మడి జిల్లాకు చెందిన తొమ్మిది డిపోల ఈయూ కార్మికుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న పదోన్నతులకు మోక్షం కల్పించాలని, సిబ్బందికి నైట్ అవుట్, ట్రావెలింగ్, ఓటీ అలవెన్స్‌లను చెల్లించాలని, ఉద్యోగ భద్రతకు సంబంధించిన సర్క్యులర్‌ను యథాతథంగా అమలు చేయాలని కోరారు. ఈయూ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.భానుమూర్తి మాట్లాడుతూ ఏళ్లతరబడి భర్తీకి నోచుకోని కారుణ్య నియామకాలను తక్షణమే చేపట్టాలన్నారు. ఈయూ రాష్ట్ర కార్యదర్శి నందమూరి రామారావు, జోనల్ నాయకులు శుభకర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు అధికారులు మోకాలడ్డు

... 5వ పేజీ తరువాయి

ఈ సర్వే చేస్తున్నారా...అని ప్రశ్నించగా అనకాపల్లి డీఆర్‌డీఏ పీడీ శచీదేవి బదులిస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాకు ఒక సచివాలయ పరిధిలో సర్వే చేశామన్నారు. పింఛన్లలో కోత ఉండదన్నారు. దివ్యాంగులకు పింఛన్ల విషయంలో ఇబ్బందులు ఉన్నాయని పలువురు సభ్యులు ప్రస్తావించగా...అల్లూరి సీతారామరాజు జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కె.కృష్ణారావు బదులిస్తూ మండలాల్లో మెగా సదరం క్యాంపుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. సంబంధిత ఎంపీడీవోల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు క్యాంపులు నిర్వహిస్తామన్నారు. వైద్య ఆరోగ్య శాఖపై చర్చ సందర్భంగా కేజీహెచ్‌కు నేరుగా వెళితే వైద్యం అందడంలో జాప్యం జరుగుతుందని, సూపరింటెండెంట్‌కు ఫోన్ చేస్తే వెంటనే చికిత్స అందుతుందని పలువురు సభ్యులు అన్నారు.

అనంతగిరి, అరకులోయ ప్రాంతాల నుంచి కేజీహెచ్‌కు 108 వాహనాల ద్వారా రోగులు, క్షతగాత్రులను తీసుకురావడం లేదని అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు ఫిర్యాదు చేయగా, ఇబ్బందులు తొలగిస్తామని 108 కో-ఆర్డినేటర్ హామీ ఇచ్చారు. విద్యా శాఖపై చర్చలో చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ చాలా పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉందన్నారు. భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు మాట్లాడుతూ నగర పరిధిలో ఉన్న జడ్పీ, ఎంపీపీ పాఠశాలలను జీవీఎంసీలో విలీనం చేయాలని కోరగా ప్రభుత్వానికి నివేదిస్తామని డీఈవో ప్రేమ్‌కుమార్ హామీ ఇచ్చారు.

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో కొన్నిచోట్ల రాత్రివేళ పర్యవేక్షణ ఉండడం లేదని అరకులోయ జడ్పీటీసీ సభ్యురాలు రోష్నీ ఫిర్యాదు చేయగా చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు, నిర్మాణాలకు ప్రతిపాదనలు వస్తే నిధులు మంజూరుచేస్తామన్నారు. ప్రతి మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు జడ్పీటీసీ సభ్యులను ఆహ్వానించాలని, గ్రామ సభల్లో చేసిన తీర్మానాల వివరాలు సర్పంచులు/ఇతర ప్రజా ప్రతినిధులకు అందజేయాలని అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా జడ్పీటీసీ సభ్యులను నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని ఆమె అన్నారు. సమావేశంలో డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

స్టార్ రేటింగ్స్‌లో వెనుకబడి!

... 5వ పేజీ తరువాయి

ఒక్క పాఠశాలకు కూడా 4, 5 స్టార్ రేటింగ్‌లో చోటు లభించలేదు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించినట్టు వైసీపీ పాలకులు చేసుకున్న ప్రచారం అంతా బూటకమని స్టార్ రేటింగ్స్‌బట్టి అర్థం అవుతున్నది. కాగా తక్కువ స్టార్స్ వచ్చిన పాఠశాలలపై ప్రభుత్వం కూటమి దృష్టి సారించనున్నది. రానున్న నాలుగున్నరేళ్లలో ఆయా పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తారు.

సీఎంకు నివేదిక

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల స్టార్ రేటింగ్ నివేదికను బుధవారం అమరావతిలో ప్రారంభమైన రెండు రోజుల జిల్లా కలెక్టర్ల సదస్సులో కలెక్టర్ విజయకృష్ణన్ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	93.00
లైవ్ ధర	113.00
విత్ స్కిన్	196.00
స్కిన్ లెస్	206.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	620
విజయనగరం	624
శ్రీకాకుళం	624

విద్యార్థినుల ఆరోగ్యంపై అలసత్వం వహించొద్దు

- ఏటీడబ్ల్యూవో, ఎంఈవో ఆదేశం

పెదబయలు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై అలసత్వం వహిస్తే సహించేదిలేదని ఏటీడబ్ల్యూవో కూడా వెంకటరమణ, మండల విద్యాశాఖ అధికారి- 2 పుష్ప జోసెఫ్ హెచ్చరించారు. మండలంలోని గోమంగి మినీ గురుకులంలో నిల్వ ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థినులను బుధవారం వారు పరామర్శించారు. అస్వస్థతల పాలై చికిత్సపొందిన ఎనిమిదిమంది విద్యార్థినులతో మాట్లాడి ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అందరూ ఆరోగ్యంగానే ఉం డటంతో పాఠశాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల వసతి, భోజనాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని వారు హెచ్చరించారు. చిన్నారులకు ఏదైనా జరిగి వారి ప్రాణాల మీదకు వస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఏ పూట వండిన వంటకాలు ఆ పూటే పెట్టాలని ఆదేశించారు. అనంతరం పాఠశాల పరిసరాలు, వంటశాలను పరిశీలించారు.



అస్వస్థతకు గురైన విద్యార్థినులతో ఏటీడబ్ల్యూవో, ఎంఈవోలు

రామన్నపాలెంలో ప్రభుత్వ భూమి కబ్జా

- రైతుల ఫిర్యాదుతో అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

మాకవరపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి రెవెన్యూ పరిధి రామన్నపాలెంలో ప్రభుత్వ భూమి కబ్జా యత్నాలను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఇక్కడ సర్వే నంబరు 597లో సుమారు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గతంలో కొంతమంది రైతులు దీనిని ఆక్రమించడంతో రెవెన్యూ అధికారులు వారిపై చర్యలు తీసుకొని హెచ్చరిక బోర్డులు పెట్టారు. అయితే కొంతమంది స్థానికులు కొద్ది రోజుల నుంచి ప్రభుత్వ భూమిని చదును చేయిస్తున్నారు. ఇదే భూమిలో ప్రభుత్వం చేపట్టిన చెక్‌డ్యామ్‌లను మట్టితో కప్పివేశారు. పక్కనే ఉన్న కొండగెడ్డను సైతం మట్టితో పూడ్చివేస్తున్నారు. దీంతో చుట్టుపక్కల భూములు వున్న రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్‌వో సాంబ బుధవారం ఇక్కడకు వచ్చి ఆక్రమణలను అడ్డుకున్నారు. అక్రమణదారులపై చర్యల కోసం ఉన్నతా అధికారులకు ఫిర్యాదు చేశారు.


రామన్నపాలెంలో ప్రభుత్వ భూమితోపాటు కొండగెడ్డను చదును చేసిన దృశ్యం

రైతు సమస్యలపై ఆందోళన రేపు

- జిల్లా వైసీపీ అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు

చోడవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలపై కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈనెల 13న కలెక్టరేట్ వద్ద ఆందోళన చేయనున్నట్టు వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు తెలిపారు. బుధవారం ఇక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రైతు భరోసా కింద ఏటా రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇంతవరకు దాని గురించి మాట్లాడడం లేదని విమర్శించారు. తడిసిన, రంగుమారిన ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం సరిగా స్పందించడం లేదని ఆరోపించారు. విద్యుత్ ఛార్జీల భారంపై ఈ నెల 27న ఈపీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై జనవరి 3న విద్యా శాఖ కార్యాలయాల వద్ద ఆందోళన చేయనున్నట్టు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ, గోవాడ చెరకు రైతులకు బకాయిలు చెల్లిస్తామని ఫ్యాక్టరీ మహాజన సభలో ప్రకటించి నెలలు గడిచినా బకాయిలు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కలెక్టరేట్ వద్ద నిర్వహించే ఆందోళనకు సంబంధించి పోస్టర్‌లను విడుదల చేశారు. సమావేశంలో వైసీపీ నాయకులు ఏడువాక సత్యారావు, శ్రీకాంత్, బూరె బాబూరావు, గాడి కాసు, బొడ్డేడ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన కార్యక్రమం పోస్టర్‌ను విడుదల చేస్తున్న బూడి, ధర్మశ్రీ, ఇతర నేతలు

కిసాన్‌మేళాను విజయవంతం చేయండి

- ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ ముకుందరావు

తుమ్మపాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఈ నెల 13న జరగనున్న 65వ కిసాన్‌మేళాను విజయవంతం చేయాలని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు కోరారు. బుధవారం ఆర్ఏఆర్ఎస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 65వ కిసాన్ మేళాలో వ్యవసాయ సహ కార మార్కెటింగ్, పశుసంవర్ధకశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా రైతు సదస్సును ఏర్పాటు చేసి రైతులకు వ్యవసాయంలో మెలకువలు, సూచనలు వ్యవసాయాధికారులు ఇస్తారని తెలిపారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. రైతులంతా పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు పీవీకే జగన్నాథరావు, డాక్టర్ బి.ఆదిలక్ష్మి, డాక్టర్ దాడి ఉమామహేశ్వరరావు, డాక్టర్ కేవీ రమణ మూర్తి, డాక్టర్ ఆర్.సరిత, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ముకుందరావు